ప్రజాశక్తి

శనివారం 9 సెప్టెంబర్ 2023 8 పేజీలు

ఎన్‌టిఆర్ కృష్ణా

డిఆర్‌ఓ మోహన్‌కుమార్ దంపతులను సత్కరిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు, ఇతర అధికారులు

అంకితభావం ఉన్న అధికారి మోహన్‌కుమార్

ఆత్మీయ వీడ్కోలు సభలో కలెక్టర్ ఢిల్లీరావు

ప్రజాశక్తి - విజయవాడ : అంకిత భావంతో విధులు నిర్వర్తించిన కె.మోహన్‌కుమార్ జిల్లా రెవెన్యూ అధికారి పదవికి పూర్తి న్యాయం చేశారని జిల్లా కలెక్టర్ ఎస్ ఢిల్లీరావు అన్నారు. జిల్లా రెవెన్యూ అధికారిగా విశేష సేవలందించి విశాఖపట్నం జిల్లా రెవెన్యూ అధికారిగా బదిలీపై వెళుతున్న కె.మోహన్‌కుమార్‌కు శుక్రవారం నగరంలోని కలెక్టరేట్ పింగళి వెంకయ్య స్పందన సమావేశ మందిరంలో జిల్లా యంత్రాంగం ఆత్మీయ వీడ్కోలు పలికింది. ఈ సందర్భంగా నిర్వహించిన సభకు జిల్లా కలెక్టర్ ఎస్ ఢిల్లీరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ డిప్యూటీ తహశీల్దార్, తహశీల్దార్, డిప్యూటీ కలెక్టర్, యూత్ వెల్ఫేర్ ఆఫీసర్, ఆర్‌డివో, ఉమ్మడి జిల్లా జాయింట్ కలెక్టర్ -2 (ఆసరా) తదితర హోదాలలో 30 ఏళ్లగా విధులు

(మిగతా 6లో)

మరో రెండు బ్యారేజీలకు ఆమోదం

- ప్రభుత్వానికి డిపిఆర్‌లు సమర్పణ
- ఎరువుల కొరత లేకుండా చర్యలు
- అగ్రిమిషన్ వైస్ చైర్మన్ నాగిరెడ్డి, కలెక్టర్ రాజాబాబు వెల్లడి

ప్రజాశక్తి - కలెక్టరేట్ (కృష్ణా): ఖరీఫ్ సీజన్లో రైతులకు ఎరువుల కొరత ఏర్పడకుండా వ్యవసాయ అధికారులు ముందస్తు జాగ్రత్తలు పాటించాలని రాష్ట్ర అగ్రి మిషన్ వైస్ చైర్మన్ ఎంవి.నాగిరెడ్డి సూచించారు. శుక్రవారం స్పందన సమావేశపు మందిరంలో కలెక్టర్ పి.రాజాబాబు అధ్యక్షతన కృష్ణాజిల్లా 39వ నీటిపారుదల సలహా మండలి, వ్యవసాయ సలహా మండలి సంయుక్త సమావేశం నిర్వహించారు. ఈకార్యక్రమంలో నాగిరెడ్డి మాట్లాడుతూ ఈ ఏడాది ఎన్నడూ లేనివిధంగా ఆగస్టులో తక్కువ వర్షపాతం నమోదైందన్నారు. రైతులు ఉన్న నీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రకాశం బ్యారేజీ కింద కృష్ణా డెల్టా పరిధిలో 13.08 లక్షల ఎకరాల ఆయకట్టు (5 జిల్లాలలో) ఉందని, ఇందులో కృష్ణాజిల్లాలో కృష్ణాతూర్పు డెల్టా పరిధిలో ఆయకట్టు 5.62 లక్షల ఎకరాలని అన్నారు. 2023-24 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి సెప్టెంబర్ 5వ తేదీ నాటికి మొత్తం 105.32 టిఎంసిల నీటిని ఖరీఫ్ సాగుకు, తాగునీటి అవసరాలకు ఉపయోగించామన్నారు. కృష్ణా తూర్పు డెల్టాకు 31.58 టిఎంసిల నీరు, కృష్ణా పశ్చిమ డెల్టాకు 15.09 టిఎంసిల నీటిని వినియోగించినట్లు చెప్పారు. ప్రకాశం బ్యారేజీ నుండి దిగువకు 58.64 టిఎంసిల కృష్ణా నది నీటిని విడుదల చేసినట్లు చెప్పారు. కలెక్టర్ పి.రాజాబాబు మాట్లాడుతూ ప్రకాశం బ్యారేజీ దిగువ

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పి.రాజాబాబు, చిత్రంలో నాగిరెడ్డి, పేర్ని

2 కొత్త బ్యారేజీలు నిర్మాణం కానున్నాయని తెలిపారు. 16 కిమీ దిగువన చోడవరం వద్ద , అలాగే 67 కిమీ దిగువన మోపిదేవి మండలంలో నిర్మించేందుకు రూ.204.37 కోట్లకు స్టేజ్ -1 పరిపాలన ఆమోదం లభించినట్లు తెలిపారు. ప్రస్తుతం రెండు బ్యారేజీల నిర్మాణానికి అవసరమైన డిపిఆర్ (డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్) తయారు చేసి, అంచనాలను ప్రభుత్వ అనుమతి కోసం సమర్పించినట్లు చెప్పారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు బ్యారేజీల స్టేజ్ -2 అంచనాలను కొత్త ఎస్-ఎస్ఆర్ 2022-23 రేట్లతో మొదటి బ్యారేజీ అంచనా విలువ రూ.2235.42 కోట్లతో, రెండో బ్యారేజీ అంచనా విలువ రూ.2526,39 కోట్లతో పరిపాలనా అనుమతికి ప్రభుత్వానికి సమర్పించినట్లు చెప్పారు. ప్రభుత్వం కొత్త ఎస్ఎస్ఆర్ 2023-24 రేట్లతో అంచనాలు తయారు చేసి తిరిగి సమర్పించాల్సి ఉందన్నారు. మచిలీపట్నం శాసనసభ్యులు పేర్ని వెంకట్రామయ్య (నాని) మాట్లాడుతూ జిల్లాలో 28,764 టన్నుల వరకు ఎరువులు అవసరమని, ఎరువుల పంపిణీలో రేషనైజేషన్ విధానం పాటించాలని కోరారు. ఈ సమావేశంలో అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్, పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ జన్ను రాఘవరావు, ఇరిగేషన్ ఎస్ఈ ప్రసాదరావు, జిల్లా వ్యవసాయాధికారి ఎన్.పద్మావతి, సివిల్ సప్లయిస్ డీఎం వి.శ్రీధర్, జిల్లా సలహామండలి సభ్యులు శ్రీకాకోళపు నాగేశ్వరరావు (బాబు), పట్టపు శ్రీనివాసరావు (నాని), పెన్నేరు ప్రభాకరరావు, పలువురు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎంపి కేశినేనిలో మార్పు వచ్చిందా!

- చంద్రబాబుపై ప్రశంసలు
- టిడిపి నుండే మూడోసారి పోటీచేస్తానని ప్రకటన

ప్రజాశక్తి - కంచికచర్ల : టిడిపి అధిష్టానంపై, ఆ పార్టీ నేతలపై ఎప్పుడూ దూకుడుగా మాట్లాడే విజయవాడ ఎంపి కేశినేని నాని మార్పు వచ్చిందా అన్న సందేహం పార్టీ శ్రేణుల్లో వ్యక్తమవుతోంది. టిడిపి అధినేత చంద్రబాబును, పార్టీని పొగుడుతూ ఆయన మాట్లాడడమే ఇందుకు కారణంగా ఉంది. 2019 ఎన్నికల తర్వాత నుండి ఎంపి కేశినేని నాని అవకాశం వచ్చినప్పుడల్లా అధినేతతో పాటు, సొంత పార్టీ నాయకులు పట్ల దూకుడుగా మాట్లాడుతున్న విషయం అందరికీ తెలిసిందే. విజయవాడ పార్లమెంటు పరిధిలో తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తో తప్ప, మాజీ మంత్రి దేవినేని ఉమా, మాజీ ఎంఎల్‌ఎలు బొండా ఉమా, షేక్ నాగుల్ మీరా, తంగిరాల సౌమ్య, శ్రీరాం తాతయ్య, మాజీ ఎంఎల్‌సి బుద్దా వెంకన్న తదితరులతో ఎంపి కేశినేనినికి విభేధాలున్నాయి. ఓ దశలో పార్టీ నియోజకవర్గ ఇన్చార్జులు సామంతరాజులు కాదని, ఇన్చార్జి అంటే రాజ్యాంగ పదవి కాదని విమర్శలు గుప్పించారు. నాని వ్యవహార శైలితో విభేధించిన మాజీ మంత్రి దేవినేని ఉమా ఆయనకు పోటీగా ఆయన సోదరుడు కేశినేని చిన్నిని తెరమీదకు తీసుకువచ్చారు. దీంతో కేశినేని బ్రదర్స్ మధ్య ఉన్న విబేధాలు కొత్తగా తెరపైకి వచ్చాయి. ఈక్రమంలో కేశినేని చిన్ని...రెండేళ్లుగా విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని పార్టీ ఇన్చార్జులను కలుపుకొని కార్యక్రమాలు చేస్తున్నారు. ఇటీవల ఎంపి కేశినేని నాని నందిగామ, జగ్గయ్యపేట, మైలవరం, తిరువూరు నియోజకవర్గాల్లో వైసిపి ఎమ్మెల్యేలతో కలిసి అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆయా కార్యాక్రమాల్లో అధికార పార్టీ ఎంఎల్‌ఎను సైతం ప్రశంసించారు. దీనిని సాకుగా చూపి దేవినేని ఉమా గ్రూపుగా ఉన్న చిన్ని, ఆయా నియోజకవర్గాల ఇన్చార్జులు ఈ విషయాన్ని అధిష్టానం దృష్టికి తీసుకెళ్లారు. విజయవాడ పార్లమెంటుకు టిడిపి నుండి చిన్ని పోటీ చేస్తారని ప్రచారం చేసుకున్నారు. ఆయా నియోజకవర్గాల్లో పార్టీ క్యాడర్ కూడా చిన్నికి సహకరించారు. ఈ దశలో ఎంపీ కేశినేని నాని టిడిపిని వీడతారని కూడా ప్రచారం జరిగింది. కానీ నాని మాత్రం అవేమీ పట్టించుకోకుండా, పార్లమెంటు పరిధిలోని 7 అసెంబ్లీ సెగ్మెంట్లలో అధికార పార్టీ ఎమ్మెల్యేలను కలుపుకొని అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఒకపక్క చంద్రబాబు నిర్ణయాలను వ్యతిరేకిస్తూనే, మరోపక్క చంద్రబాబు ఢిల్లీ వెళ్లినప్పుడు ఆయన వెంటే ఉంటున్నారు. ఈ క్రమంలో ఎంపి నాని పార్లమెంటు పరిధిలో తన అనుచర వర్గాన్ని పెంచుకున్నారు. ఇటీవల టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ విజయవాడలో నిర్వహించిన యువగళం పాదయాత్రకు నాని దూరంగా ఉన్నారు. తమకు సమాచారం లేదని తప్పుకున్నారు. దీంతో యువగళం పాదయాత్రను విజయవంతం చేసే బాధ్యతను నాని సోదరుడు చిన్ని తన భుజస్కంధాలపై వేసుకున్నారు. దీంతో టిడిపి ఎంపి టికెట్ ఈసారి చిన్నికి వస్తుందని పార్టీ శ్రేణుల్లో ప్రచారం జరిగింది. ఈక్రమంలో శుక్రవారం కంచికచర్లలో జరిగిన ఓ ప్రైవేట్ కార్యక్రమానికి హాజరైన ఎంపి కేశినేని చంద్రబాబుపై, పార్టీపై విధేయత కనబరుస్తూ పొగడ్తలు గుప్పించారు. చంద్రబాబుకు ఐటి నోటీసులు రావడంపై మీడియా అడిగిన ప్రశ్నలకు నాని సమాధానం ఇచ్చారు. చంద్రబాబును పొగడ్తలతో ముంచెత్తారు. దేశంలో నీతి నిజాయితీ, నిబద్ధత కలిగిన, 45 ఏళ్ల రాజకీయ జీవితంలో మచ్చలేని నాయకుడు చంద్రబాబు అన్నారు. అలాగే తన ఐడియాలజీ టిడిపి అని, వచ్చే ఎన్నికల్లో విజయవాడ పార్లమెంటుకు టిడిపి నుండి పోటీ చేసి గెలిచి మూడోసారి పార్లమెంట్లో అడుగు పెడతానని ధీమా వ్యక్తం చేశారు. అంకితభావంతో ప్రజాసేవ చేసే వారికి రాజకీయ పదవులు వస్తాయన్నారు. ఎప్పుడూ ఏదో ఒకటి వివాదాస్పద వ్యాఖ్యలు చేసే ఎంపి కేశినేని...చంద్రబాబు పట్ల, పార్టీ పట్ల విధేయతగా మాట్లాడటంతో ఆయనతో మార్పు వచ్చిందా అని టిడిపి శ్రేణులు చర్చించుకుంటున్నాయి. దీంతోపాటు తాను టిడిపిలోనే ఉన్నానని, ఇక ముందు కూడా ఉంటానని చెప్పుకొచ్చారు. పార్టీ అధినేత చంద్రబాబు...కేశినేని నానికి ఎంపి సీటుపై క్లారిటీ ఇచ్చారా అని విశ్లేషకులు చర్చించుకుంటున్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపి బాలశౌరి, చిత్రంలో కలెక్టర్ పి.రాజాబాబు తదితరులు

కౌలు రైతులకూ రుణాలు మంజూరు

- బ్యాంకర్లకు కలెక్టర్ రాజాబాబు సూచన
- అధికారులతో కమిటీ ఏర్పాటుకు ఎంపి బాలశౌరి విజ్ఞప్తి

ప్రజాశక్తి - కలెక్టరేట్ (కృష్ణా) భూమిని కౌలుకు తీసుకుని సాగు చేసే రైతులకు రుణాలు విరివిగా మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు బ్యాంకు అధికారులను కోరారు. శుక్రవారం స్పందన సమావేశపు హాలులో బ్యాంకు అధికారులతో కలెక్టర్ అధ్యక్షతన డిస్ట్రిక్ట్ కన్సల్టేటివ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో బందరు పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి, కలెక్టర్ పి.రాజాబాబు పలు అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 55 వేల మంది కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులు మంజూరు చేయగా, వీరిలో కేవలం 7 వేల మందికి మాత్రమే రూ.30.71 కోట్ల రుణాలను మంజూరు చేశారని, మిగిలిన 48 వేల మంది కౌలు రైతులు బ్యాంకు రుణాలకు దూరమయ్యారని అన్నారు. ఈవిషయంలో బ్యాంకులు భూ యజమానికి సులువుగా రుణాలను మంజూరు చేసినట్లుగా కౌలు రైతులకు ఇవ్వకపోవడం పట్ల ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. కౌలు రైతులు ఏవిధమైన ష్యూరిటీ సమర్పించనందున రుణ మంజూరుకు సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని బ్యాంకర్లు తెలుపగా, అందుకు ప్రభుత్వం మంజూరు చేస్తున్న సీసీఆర్‌సీ కార్డుల ఆధారంతోపాటు స్వయం సహాయక సంఘాల్లోని సభ్యుల పొదుపు ఖాతాల ఆధారంగా ఆయా కౌలు రైతులకు రుణాలను మంజూరు చేసే దిశగా బ్యాంకర్లు ఆలోచన చేయాలని కలెక్టర్ సూచించారు. స్వయం సహాయక సంఘాల గ్రూపుల నుంచి ఇన్సూరెన్స్ పేరుతో అధిక ప్రీమియం, ప్రోసెసింగ్ ఫీజుల పేరుతో బ్యాంకులు అధికంగా నగదు వసూలు చేస్తున్నాయని డిఆర్‌డిఎ పీడీ ప్రసాద్ కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, స్వయం సహాయక సంఘాలకు ఇచ్చే రుణాలపై అధిక వడ్డీలు, ఫీజులు వసూళ్లపై మాత్రమే దృష్టి పెట్టకుండా మహిళల ఆర్థికాభివృద్ధికి బ్యాంకులు తమ వంతుగా బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. చేతివృత్తుల

(మిగతా 6లో)

విద్యారంగ అభివృద్ధికి సైకిల్ యాత్ర

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : ఎన్టీఆర్ జిల్లా విద్యారంగ అభివద్ధికై ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చేపట్టిన సంఘర్షణ సైకిల్ యాత్రలో రెండోవరోజులో భాగంగా ఇబ్రహీంపట్నం చేరుకుంది. వీరికి ప్రజాసంఘాల నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం జిల్లా పరిషత్ స్కూల్‌లో విద్యార్థులతో మాట్లాడారు. కొండపల్లి పట్టణంలో ఉన్న నాగార్జున జూనియర్ కళాశాల విద్యార్థులతో సభ నిర్వహించారు. ఈ యాత్రనుద్దేశించి ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.సోమేశ్వరరావు, ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి సిహెచ్.వెంకటేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు జి.గోపినాయక్ మాట్లాడుతూ అనేక సంవత్సరాల నుండి విద్యార్థులు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారనీ. రాష్ట్ర ప్రభుత్వం గత నాలుగేళ్ల నుండీ అమలు చేస్తున్న పథకాలూ, సంస్కరణల వల్ల ప్రభుత్వ విద్య పటిష్టం కావడం లేదన్నారు. నాడు - నేడు ద్వారా నిర్మిస్తున్న భవనాలు ఇంకా పూర్తి కాలేదన్నారు. (2023-24) విద్యా సంవత్సరంలో విద్యా కానుక కిట్లు పాఠ్య పుస్తకాలూ, నోట్బుక్ లూ, వర్క్ బుక్ లూ, మూడు జతల దుస్తులూ, డిక్షనరీబీ బూట్లూబీ సాక్సూ ఇవన్నీ ఇంకా ప్రభుత్వం పూర్తిగా అందించలేక పోయారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.కుమార్ నాయక్, జిల్లా సహాయ కార్యదర్శి ఎం.రాజు, మన్మధ, కుమార్ స్వామి, జిల్లా కమిటీ సభ్యులు రిజ్వాన్, మాధవ్, ఎస్ఎఫ్ఐ నాయకులు కమల్, పునీత్ వర్మ, సిఐటియు మండల కార్యదర్శి ఎం.మహేష్, సిఐటియు సీనియర్ నాయకులు ఎ.విఠల్ రావు, విటిపియస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు, వి.నాగరాజు, ఆటో డ్రైవర్ యూనియన్ నాయకులు, హాకర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి కంచికచర్ల : విద్యారంగా అభివద్ధికై ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చేపట్టిన సంఘర్షణ సైకిల్ యాత్ర శుక్రవారం కంచికచర్లకు చేరింది. స్థానిక జిల్లా పరిషత్ స్కూల్, ర్ల అక్షర ,దీక్ష జూనియర్ కాలేజీలలో సైకిల్ యాత్ర బందం సభ్యులు, పర్యటించారు. ఈ యాత్రను ఉద్దేశించి ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.సోమేశ్వరావు మాట్లాడుతూ రాష్ట్రంలో డిగ్రీ విద్యలో (2023-24) విద్యా సంవత్సరానికి మైనర్, మేజర్ సింగిల్ సబ్జెక్ట్ని ఎంపిక చేసుకోవాలని రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ నిర్దేశించింది. నూతన విద్యా విధానం వెలుగులో యూనివర్సిటీ గ్రాంట్స్ కమీషన్ ఆదేశాలననుసరించి అమలు చేయనున్నారు. ముందస్తు ప్రణాళికా, అవగాహన లేకుండా ప్రయోగాలు చేయడం ద్వారా ప్రతికూల ఫలితాలొచ్చే ప్రమాదమున్నదనీ ఆయన అన్నారు. జిల్లా కార్యదర్శి సిహెచ్.వెంకటేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు జి.గోపినాయక్ మాట్లాడుతూ ఈ సమస్యల పరిష్కారం కోసం 10 రోజులు పాటు జరుగుతున్న ఎస్ఎఫ్ఐ సైకిల్ యాత్రను జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ యాత్రలో సభ్యులు ఎస్ఎఫ్ఐ ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.కుమార్ నాయక్, జిల్లా సహాయ కార్యదర్శి ఎం.రాజు, మన్మధ, కుమార్ స్వామి, జిల్లా కమిటీ సభ్యులు రిజ్వాన్, మాధవ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కోట కళ్యాణ్, సిఐటియు నాయకులు, భూషణం, విద్యార్థులు పాల్గొన్నారు.

కంచికచర్లలో...

ఇబ్రహీంపట్నంలో...

శ్రీమహాలక్ష్మి అమ్మవారికి లక్ష కుంకుమార్చన

పూజలో పాల్గొన్న ఆలయ కమిటీ సభ్యులు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : స్థానిక చిట్టినగర్‌లో వేంచేసియున్న శ్రీ మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం (కొత్త అమ్మవారి) గుడిలో శ్రావణ మాసం నాలుగవ శుక్రవారం సంద ర్భంగా ఉదయాన్నే అమ్మవారి సుప్రభాతసేవ, పంచామత అభిషేకము, విశేషాలం కరణ ఉభయ దాతల గోత్రనామాలతో సహస్రనామార్చనాతో, లక్ష కుంకుమార్చనలు వైభవంగా జరిగాయి. అమ్మవారికి పుష్పయాగం విశేషంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో లక్ష కుంకుమార్చనలో పాల్గొన్నారు. పంచహారతులు నీరాజన మంత్రపుష్పములు తీర్థ ప్రసాద వితరణ, అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం పాలకవర్గ గౌరవ అధ్యక్షులు బెవర సూర్యనారాయణ, కార్యదర్శి మరుపిళ్ళ హనుమంతురావు , కోశాధికారి పిళ్ళా శ్రీనివాస రావు (పి.సి.) కార్యవర్గసభ్యులు కామందుల నరసింహారావు , మజ్జి శ్రీనివాసరావు , పిళ్ళా విజయ్, తమ్మిన సూర్యకుమారి, పణుకు రమ ,బెవర శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వీధి కుక్కలను నివారించండి

కార్పొరేటర్ బోయి సత్యబాబు

బాధితుడిని పరామర్శిస్తున్న కార్పొరేటర్ బోయి సత్యబాబు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : గొల్లపాలెం గట్టు కొండ ప్రాంతంలో వీధి కుక్కల దాడిలో గాయాలు పాలవు తున్నారని, వాటిని నివారిం చాల్సిన బాధ్యత విఎంసి అధికారులపై వుందని సిపిఎం ఫ్లోర్ లీడర్, 50వ డివిజన్ కార్పొరేటర్ బోయి సత్యబాబు అధికారులను కోరారు. డివిజన్ పరిధిలోని వీధి కుక్క కాటుకు గురైన వ్యక్తిని కార్పొరేటర్ బోయి సత్యబాబు శుక్రవారం అతన్ని పరామర్శించారు. పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ప్రజల సమస్యలను మున్సిపల్ అధికారుల దష్టికి తీసుకువెళ్లిన నేపథ్యంలో ప్రజల మీద దాడి చేస్తున్న కుక్కను తరలించారు. వీధి కుక్కల నియంత్రణ సక్రమంగా జరగకపోవడం వలన ప్రజలు వీధీ కుక్కలు బారిన పడి గాయాలు పాలఅయి ప్రమాదాలకు లోనవుతున్నారని తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

ప్రజాశక్తి - వన్‌టౌన్ : దోమలు వృద్ధి చెంది ఎక్కువగా వ్యాప్తి చెందకుండా ఉండేలా ప్రజలు అధికారులకు సహకరించాలని 52వ డివిజన్ కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు (చంటి) కోరారు. స్థానిక 52వ డివిజన్ కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు (చంటి) కొత్తపేట కొండ ప్రాంతంలో మలేరియా పారిశుద్ధ్య అధికారులు సిబ్బందితో శుక్రవారం పర్యటించి సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి శుక్రవారం డ్రైడే - ఫ్రైడేని పాటించి ఇళ్లల్లో ఉన్న డ్రమ్ములు, తొట్టిలు, కొండలు, నీటి నిలువ ఉండే ప్రదేశాలను గుర్తించి వాటిని శుభ్రంగా నీరు కడిగి పట్టుకోవాలన్నారు.

చిట్టినగర్‌లో అన్న క్యాంటీన్

భోజనం పెడుతున్న దృశ్యం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : రానున్న ఎన్నికల్లో తెలుగు దేశం ఘనవిజయం సాధించడం ఖాయమని, మళ్లీ అన్నక్యాంటీన్లను ప్రారంభి స్తామని తెలుగు దేశం 48వ డివిజన్ అధ్యక్షులు పేరాబత్తుల రమణ అన్నారు. శుక్రవారం చిట్టినగర్ సెంటర్‌లో మొబైల్ అన్నక్యాంటీన్ ద్వారా పేదలకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా పేరాబత్తుల రమణ మాట్లాడుతూ తెలుగుదేశం నాయకులు కేశినేని చిన్ని, బుద్దా వెంకన్న, నాగుల్‌మీరా ఆధ్వర్యంలో పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్విఘ్నంగా జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు కాండ్రేగుల రవీంద్ర, రాయన రాజా పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల జీతాలు చెల్లించాలని ధర్నా

ప్రజాశక్తి - నందిగామ : ఎన్టీఆర్ జిల్లా, నందిగామ మండలంలో పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల జీతాలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం నందిగామ రెవిన్యూ డివిజనల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల నాయకులు మాట్లాడుతూ ఆగస్టు నెల పెండింగ్ ఉన్న ఉపాధ్యాయుల జీతాలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. మండలానికి ఎఫ్ఎసి ఎంఈఓను తక్షణమే నియమించాలని డిమాండ్ చేశారు. అనంతరం నందిగామ రెవిన్యూ డివిజన్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు యుటిఎఫ్ ఎన్టీఆర్ జిల్లా కోశాధికారి మహేశ్వర వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయ సంఘ నాయకులు పాల్గొన్నారు.

నందిగామ ఆర్డిఒ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఉపాధ్యాయులు

దుర్గగుడిలో సామూహిక శ్రావణ వరలక్ష్మీ వ్రతాలు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి దుర్గగుడిలో నాల్గవ శుక్రవారం సందర్భంగా దేవస్థానం ఆధ్వర్యంలో వరలక్ష్మీ వ్రతాలు వైభవోపేతంగా నిర్వహించారు. శ్రావణ శుక్రవారం సందర్భంగా శ్రీ అమ్మవారి ఆలయం నందు వివిధ వర్ణముల పూలతో సుందరంగా అలంకరించారు. ఉదయం నుండి భక్తులు విశేష సంఖ్యలో విచ్చేసి శ్రీ కనకదుర్గ అమ్మవారిని దర్శించుకున్నారు. నాల్గవ శుక్రవారం సందర్భంగా మహామండపం ఆరవ అంతస్తులో ఆలయ వైదిక సిబ్బంది, అర్చకులచే "వరలక్ష్మీ వ్రతం" ఉదయం 7.00 గంటలకు ఆర్జిత సేవ గానూ, 10 గంటలకు ఉచితంగా సామూహిక వరలక్ష్మీ వ్రతం వైభవంగా నిర్వహించారు. దేవస్థానం వారు ఉచిత సామూహిక వరలక్ష్మి వ్రతమునకు 500 పైగా మహిళలు ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్నారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి దర్భముళ్ల భ్రమరాంబ ఈ కార్యక్రమానికి విచ్చేసి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పెనుగంచిప్రోలు : స్థానిక శ్రీ తిరుపతమ్మ అమ్మవారి ఆలయంలో శ్రావణ మాసం సందర్భంగా శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతాలు వైభవంగా నిర్వహించారు. ఆలయంలోని శ్రీ తిరుపతమ్మ అమ్మవారి ఆలయానికి ఎదురుగా వున్న మండపంతో పాటు అన్ని మండపాలలో, ఆలయ వెనుక భాగమున పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని అత్యంత భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ చెన్న కేశవ రావు, ధర్మకర్తలి మండలి సభ్యులు కోలా. రామారావు, నరసింహారావు, లు దగ్గర వుండి భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు. ఆలయంలో జరుగుతున్న నిత్య అన్నదాన పథకానికి వీరుల పాడు మండలం పొన్నవరం గ్రామానికి చెందిన కొంగర. సుజాత 10,116 రూపాయల విరాళాన్ని ఆలయ చైర్మన్ చెన్న కేశవరావుకు అందజేశారు. ఆలయ డిప్యూటీ కలెక్టర్ కార్యనిర్వహణాధికారి రమేష్ నాయుడు ఆదేశాలు మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు సిబ్బంది ధర్మకర్తలు పాల్గొన్నారు.

నేత్రదాన పక్షోత్సవాల ర్యాలీ

ప్రజాశక్తి - అజిత్‌సింగ్‌నగర్ : నేత్రదాన పక్షోత్సవాలు ముగింపులో భాగంగా గొల్లపూడిలో స్వాతి స్కూల్ విద్యార్థులు ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ హ్యూమన్ రైట్స్ కమిషన్ మెంబర్ డాక్టర్ జి.శ్రీనివాసరావు హాజరయ్యారు. ర్యాలీలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఎబిసిడి ట్రస్ట్ చేస్తున్న నేత్రదాన పక్షోత్సవాల కార్యక్రమం చాలా అభినందదాయకమని నేటి యువతకు ఆదర్శమని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో స్వాతి స్కూల్ ప్రిన్సిపాల్ కాకాని సాంబశివ, ఏపీపీ గడ్డం రవి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

పక్షోత్సవాల ముగింపులో పాల్గొన్న డాక్టర్ శ్రీనివాస్, తదితరులు

మృతిచెందిన అప్పయ్య

ట్రాక్టర్ అదుపు తప్పి డ్రైవర్ మృతి

ప్రజాశక్తి - వత్సవాయి : ట్రాక్టర్ అదుపుతప్పి డ్రైవర్ మతి చెందిన సంఘటన మండలంలోని భీమవరం శివార్లలో చోటుచేసుకుంది గ్రామస్తులు తెలిపిన సమాచారం మేరకు గ్రామానికి చెందిన పాశం అప్పయ్య(42) గ్రామానికి ఎంపి నిధులు ద్వారా పంచాయతీకి మంజూరైన వాటర్ ట్యాంకర్ రిజిస్ట్రేషన్ నిమిత్తం జగ్గయ్యపేట వెళ్లి వస్తుండగా భీమవరం గ్రామ సమీపంలోని ఆంజనేయ స్వామి గుడి సమీపంలో ట్రాక్టర్ అదుపుతప్పి పొలాలలోకి దూసుకు వెళ్లింది. సమాచారం తెలుసుకున్న స్థానిక ఎస్ఐ అభిమన్యు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని స్థలానికి చేరుకొని అప్పయ్యను 108ను పిలువగా పరీక్షించిన ఈఎంటి స్వర్ణకుమారి అప్పటికే అప్పయ్య మృతిచెందినట్లు తెలిపారు.

ఇ-క్రాప్ నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : మండలంలోని బాలుసుపాడు గ్రామంలో శుక్రవారం ఇ క్రాప్ నమోదు కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి వి.వరలక్ష్మి పరిశీలించారు. మండలంలోని రైతులందరూ రైతు భరోసా కేంద్రాల్లో వ్యవసాయ సంచాలకులు సంప్రదించి ఈ క్రాప్ నమోదు చేసుకోవాలని తద్వారా ప్రభుత్వం నుండి వచ్చే వై ఎస్ ఆర్ పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిటి, సున్న వడ్డీ, పంట రుణాలు, ధాన్యం కొనుగోలు పథకాలందుతాయన్నారు.

బ్రిడ్జి నిర్మాణానికి నిధులు

ప్రజాశక్తి - తిరువూరు : గంపలగూడెం మండలం, వినగడప కట్టలేరు వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి 20 రోజుల్లో శంకుస్థాపన చేసి పనులను వేగవంతం చేయనున్నట్లు ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి శుక్రవారం తిరువూరు నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. త్వరలో బ్రిడ్జికి సంబంధించిన జిఒ రానుందని, హైలెవల్ కాంట్రాక్టర్‌తో బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. తిరువూరు వచ్చినప్పుడు ముఖ్యమంత్రి ఇచ్చిన హామీల్లో బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేశారని తెలిపారు. ఈ సమావేశం లో ఎఎంసి చైర్మన్ నాగనర్సిరెడ్డి పాల్గొన్నారు.

భోజనం వడ్డిస్తున్న దృశ్యం

కొనసాగుతున్న అన్న క్యాంటీన్

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : టిడిపి జాతీయ కోశాధికారి శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) ఆధ్వర్యంలో నడుస్తున్న అన్నా క్యాంటీన్ 431 వ రోజు కొనసాగింది. శుక్రవారం అన్న క్యాంటీన్లో 819 మంది భోజనం చేశారు. ఈ అన్నదాన కార్యక్రమాన్ని మేక వెంకటేశ్వర్లు, రాధాకృష్ణ, కేళి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రారంభించారు.

సైకో పోయి సైకిల్ రావాలి : శ్రీరాం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : "బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ" కార్యక్రమంలో భాగంగా పట్టణంలో 5వ వార్డు వైవై కాలనీలో స్థానిక టిడిపి నాయకులతో కలిసి టిడిపి జాతీయ కోశాధికారి, నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జి శ్రీరాం రాజగోపాల్ పర్యటించారు. ఈ సందర్భంగా తాతయ్య మాట్లాడుతూ రాష్ట్రాభివద్ధి టీడీపీతోనే సాధ్యమన్నారు.

విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించాలి

ప్రజాశక్తి హనుమాన్‌జంక్షన్ : విద్యార్థులు మానకోల్లా సానికి, శారీరక ధారుఢ్యం పెంపొందించేందుకు క్రీడల్లో పాల్గొనేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని మానవత రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు అన్నారు. బాపులపాడు హైస్కూల్కు మానవత సేవా సంస్థ వితరణ చేసిన ఖోఖో పోల్ను హెచ్‌ఎం తోట వెంకట నాగేశ్వరరావు, పీడీ పి. వెంకటేశ్వరరావులకు శుక్రవారం అందజేశారు. విద్యార్థుల్లో క్రీడలపై అసక్తి పెంపొందించేందుకు మానవత అందిస్తున్న సహకారం అభినందనీయమని, సద్వినియోగం చేసుకోవాలని హెచ్‌ఎం సూచించారు. ఈ కార్యక్రమంలో మానవత అధ్యక్షుడు దయాల ప్రభాకరరావు, కార్యదర్శి కళ్లేపల్లి నారాయణరావు, కోశాధికారి పాగోలు గణేష్బాబు, వడ్డి రాజేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా కట్టలేరు రహదారి పనులు

ప్రజాశక్తి-గంపలగూడెం: ఆగమేఘాలపై కట్టలేరు తాత్కాలిక రహదారి పనులు శుక్రవారం ప్రారంభమైయ్యాయి. గత మూడు రోజులు నాడు పడిన వర్షాలకు ఆ రహదారి మళ్లీధ్వంసం అయింది. దీనితో ప్రయాణికులకు తిరిగి కష్టాలు మొదలైనట్లు ప్రజలు పేర్కొంటున్నారు. విషయం తెలుసుకున్న తిరువూరు ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణ నిధి వెంటనే స్పందించారు. రోడ్లు భవనాల శాఖ అధికారులను ఆదేశించి వెంటనే రహదారి పనులు చేయాలని ఆదేశించగా, వెంటనే అధికారులు వంతెన తాత్కాలిక రహదారి పనులు పునం ప్రారంభించారు.

పెంచిన విద్యుత్ ఛార్జీలను ఉపసంహరించాలి

ప్రజాశక్తి-అవనిగడ్డ : పెంచిన విద్యుత్ ఛార్జీలను వెంటనే ఉపసంహరించుకోవాలని జనసేన పట్టణ పార్టీ అధ్యక్షులు రాజనాల వీరబాబు డిమాండ్ చేశారు. చంద్రబాబు నాయుడు అధికారంలో ఉండగా విద్యుత్ ధరలు పెంచి సామాన్యుల నెత్తిపై మోపిన విద్యుత్ ఛార్జీలను పూర్తిస్థాయిలో తగ్గిస్తానని మాయమాటలు చెప్పి 2019లో అధికారంలోకి వచ్చిన జగన్మోహన్ రెడ్డి నాలుగేళ్ల పాలనలో విద్యుత్ చార్జీలు తగ్గించకపోగా మరింత ప్రజలపై భారాలు మోపి సామాన్యులు తట్టుకోలేని విధంగా క్రూ ఆఫ్ చార్జీలంటూ ఇంకా రెండింతలు భారాన్ని మోపారు అని విమర్శించారు. దీనితో అప్పటి ప్రభుత్వం కొనుగోలు చేసిన బొగ్గు ఇతర అవకతవకలు బిల్లులపై సవరణలు చేయడం జరుగుతుందని కల్లబొల్లి కబుర్లు చెబుతున్నారని అయితే ఆనాటి ప్రభుత్వంలో ఉన్నటువంటి జరిగిన అవకతవకల నష్టాన్ని ఇప్పుడు ప్రజల మీద మోపటం ప్రభుత్వ చేతకానితనానికి నిదర్శనం అన్నారు. అందువల్ల వెంటనే విద్యుత్ చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేశారు.

పంటలకు ఈక్రాప్ నమోదు తప్పనిసరి

ప్రజాశక్తి-పెదపారుపూడి : రైతులు తమ పంటలకు ఈక్రాప్ నమోదు చేసుకోవాలని, నమోదు చేయని పంట ప్రభుత్వం అందించే పథకాలకు అర్హులు కారని వ్యవసాయ సలహా మండలి మండల చైర్పర్సన్ జూపల్లి శేఖర్ బాబు శుక్రవారం అన్నారు. మండల కేంద్రమైన పెదపారుపూడి రైతు భరోసా కేంద్రంలో మండల వ్యవసాయ అధికారి ఆంజనేయరావు అధ్యక్షతన రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ రైతులు తమ పొలాలలో మూడో విడత ఎరువులు వేయటానికి సిద్ధంగా ఉన్న తరణంలో కాంప్లెక్స్ ఎరువులు తగ్గించి యూరియా, పొటాష్ లను మాత్రమే వాడాలని అన్నారు. పై రెండు వాడటం వలన

మాట్లాడుతున్న శేఖర్‌బాబు

అధిక దిగుబడి వస్తుందని వాడకపోతే తప్ప కంకెలు వచ్చే అవకాశం ఉన్నందున రైతులు గమనించాలని ఏవో రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది మండల రైతులు పాల్గొన్నారు.

మలపరాజుగూడెంలో 'భవిష్యత్‌కు గ్యారెంటీ'

బంటుమిల్లి మండలంలో పాల్గొన్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-బంటుమిల్లి : బంటుమిల్లి మండలంలోని మలపరాజుగూడెం గ్రామంలో బాబుష్యూరిటి భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో పెడన నియోజక వర్గ టీడీపీ ఇంఛార్జి శ్రీ కాగిత కష్ణప్రసాద్ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ఆడబిడ్డ నిధి'తో ప్రతి మహిళకు ఆర్థిక భరోసా దక్కనుందన్నారు. 'తల్లికి వందనం' పథకంతో ఇక ఏ తల్లికీ పిల్లల చదువు భారం కాదని, దీపం పథకం కింద ప్రతి కుటుంబానికీ ఏడాదికి 3 వంట గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందనుండడంతో మహిళలకు స్వాంతన చేకూరనుందన్నారు. అలాగే ఆర్టీసీ బస్సుల్లో స్త్రీలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించనున్నారని, టీడీపీ అధికారంలోకి రాగానే ఈ పథకాలన్నీ అమలుకానున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో నియోజక వర్గ అబ్జర్వర్ సాదరబోయిన ఏడుకొండలు ,మండల పార్టీ అధ్యక్షులు వీరబాబు, వాణిజ్య విభాగం ఉపాధ్యక్షులు లీలా కష్ణ , లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి రంగనాథ్ , మండల పార్టీ ప్రధాన కార్యదర్శి బొర్రా కాశీ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మొవ్వ : మొవ్వ మండలంలోని జె జె నగర్, చిన్న హరిజనవాడ ప్రాంతాలలో టిడిపి శ్రేణుల ఆధ్వర్యంలో మహాశక్తి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో కష్ణాజిల్లా తెలుగు మహిళ అధికార ప్రతినిధి మైనేని ఇందిర , గుత్తికొండ పద్మ , నియోజకవర్గ మహిళా కమిటీ సభ్యులు అరుణ కుమారి, చాట్ల పున్నమ్మ , జుజ్జవరపు పద్మజ, ఈడుపుగంటి లక్ష్మీ శ్రీ , కాకాని సుధారాణి, పెద్దమూత్తేవి చిన్ని బూతు కన్వీనర్లు శీలం బాబురావు , పొట్లూరి బ్రహ్మేశ్వర రావు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం

ప్రజాశక్తి పెదపారుపూడి : మండలంలోని జమీదింటకుర్రు గ్రామంలో ఈనెల 5వ తేదీన గుండెపోటుతో మతి చెందిన జాస్తి శ్రీనివాసరావు కుటుంబానికి ఆ గ్రామ సర్పంచ్ పునుకొల్లు శివరాం ప్రసాద్ వైయస్సార్ భీమా తాలూకా మట్టి ఖర్చు నిమిత్తం రూ. 10,000లు శుక్రవారం అందించారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ ఎం ఎస్ వి రమణ, గ్రామ పెద్దలు నర్రా వెంకట రామారావు, తదితరులు పాల్గొన్నారు.

బాలమ్మకు ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి పెదపారుపూడి : మండలంలోని జమిదింటకుర్రు గ్రామంలో వేంచేసియున్న బాలమ్మ తల్లికి గ్రామస్తులు ప్రత్యేక పూజలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ప్రతి ఏటా శ్రావణమాసంలో ఆఖరి శుక్రవారం చుట్టుప్రక్కల గ్రామస్తులు బాలమ్మ తల్లిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకుని, ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని అన్నారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు అధిక సంఖ్యలో దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం వేల సంఖ్యలో అన్న సమారాధన కమిటీ వారిచే నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పునుకొల్లు శివరాం ప్రసాద్, మాజీ సర్పంచ్ జాస్తి రామచంద్రరావు, వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

రేపు అడ్వాన్స్‌డ్ సర్జికల్ టెక్నికల్ సమస్యలపై అవగాహన

ప్రజాశక్తి-గుడివాడ : గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేది ఆదివారం స్థానిక నాగవరప్పాడు వంతెన సమీపంలోని సౌజన్యాస్ విజయసాయి హాస్పిటల్ డాక్టర్ రాజ్‌కుమార్ హాస్పిటల్ సౌజన్యంతో అడ్వాన్స్డ్ సిర్జికల్ టెక్నిక్స్, క్రిటికల్ కేర్ సమస్యలపై అవగాహన సదస్సును నిర్వహిస్తునట్లు సంక్షేమ సంఘం గుడివాడ ఏరియా అధ్యక్షులు సాగిరాజు ఉదయభాస్కరరాజు, కార్యదర్శి మేడూరి రమేష్‌బాబులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పలువురు వైద్యులు పాల్గొని వైద్యంపై పలు సూచనలు తెలుపుతారన్నారు. ఈ అవగాహనా సదస్సుకు ప్రతి ఒక్కరి పాల్గొని విజయవంతం చేయాలని తెలిపారు.

నూతన ఆవిష్కరణల విశిష్టతపై అవగాహన

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : స్థానిక శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరంలో చేరిన విద్యార్థులకు జీరో సెమిస్టర్ లో భాగంగా ఏఐసిటిఈ ఆదేశాలకనుగుణంగా గత వారం రోజులుగా నిర్వహిస్తున్న ప్రేరణా కార్యక్రమాలు శుక్రవారంతో ముగిశాయి. వివిధ ప్రాంతాల నుండి విభిన్న ఆలోచనలతో వచ్చిన విద్యార్థుల మనస్సులను ఏకీకతం చేసేందుకు, స్థానిక పరిసరాలపై అవగాహన కల్పించేందుకు వారం రోజుల పాటు వినూత్న కార్యక్రమాలు రూపొందించి అమలు చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.వి.ఎస్ ఎన్.ఆర్.వి. ప్రసాద్ తెలిపారు. ఆఖరు రోజైన శుక్రవారం అటల్ మిషన్ మేనేజర్, విజ్ఞాన ఆశ్రమం, పూణే నుండి కిషోర్ ఎస్. గైక్వాడ్ విచ్చేసి, ప్రస్తుత విద్యా విధానంలో నూతన ఆవిష్కరణల విశిష్టతను, దానిని చేరుటకు తగు ఆలోచనా రీతులను వివరించారు. సమాజానికి ఇంజనీర్ ఆవశ్యకతను గుర్తు చేశారు. అదే విధంగా మానవతా విలువలను ఆచరిస్తూ అనాదిగా మానవుడు అభివద్ధి చెందిన తీరును వర్ణిస్తూ వ్యక్తిత్వ వికాసాన్ని ఏ విధంగా దోహదం చేస్తుందో తనదైన శైలిలో డైట్ విశ్రాంత ప్రిన్సిపాల్ ఎం.వి.జి. ఆంజనేయులు చక్కటి పేరడీ పాటలతో అలరించారు. అతిథులను కళాశాల ప్రిన్సిపాల్ దుశ్శాలువా మరియు జ్ఞాపికతో సత్కరించారు. కళాశాల ప్రాంగణ ఎంపిక అధికారి ఎమ్.ఎన్. హరికష్ణ ప్రాంగణం ఎంపికకు తీసుకోవలసిన జాగ్రత్తలను, విధి విధానాలను వివరించారు. ప్రతీ రోజు ముందుగా ప్రగతి సాధించిన వ్యక్తుల గురించిన స్ఫూర్తిదాయకమైన వీడియో లను ప్రదర్శించి, విద్యార్థులను ఆలోచిం పజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ పి.కోదండ రామారావు, డాక్టర్ ఎం.ఆర్.సి. హెచ్.శాస్త్రి, డైరెక్టర్ (ఏఎస్అండ్ ఏ) డాక్టర్ బి.కరుణ కుమార్, యాజమాన్య సలహాదారులు డాక్టర్ పి.రవీంద్ర బాబు తదితరులు పాల్గొన్నారు.

చోరీ జరిగిన జ్యూయలరీ షాపు

జ్యూయలరీ షాపులో చోరీ

- ఉంగరం కొనేందుకు వచ్చి బాక్సుతో ఉడాయించిన వైనం

ప్రజాశక్తి-చల్లపల్లి : చల్లపల్లిలో గురువారం రాత్రి జ్యూయలరీ షాపులో ఉంగరాల బాక్సుతో అపరిచిత వ్యక్తి ఉడా యించిన వైనం తీవ్ర కలకలాన్ని సష్టించింది. బందరురోడ్డులోని పరిశె యుగంధర్ కు చెందిన స్వాతి జ్యూయలరీలో ఈ చోరీ జరిగింది.గురువారం రాత్రి 9 గంటల సమయంలో టోపీ ధరించిన ఓ వ్యక్తి ఉంగరాలు కొనేందుకు వచ్చాడు. బాక్సులో ఉంగరాలు తీసి చూపుతుండగా, ఉంగరాలు సెలక్షన్ చేసుకుంటున్నట్లు నటిస్తూ ఒక్కసారిగా బాక్సు చేతపట్టుకుని బయటకు పరుగులు తీశాడు. అదే సమయానికి షాపుబయట ఒక వ్యక్తి బైక్ పై సిద్ధంగా ఉండగా, బైక్ ఎక్కి పరారయ్యాడు. సమాచారం అందుకున్న చల్లపల్లి సీఐ బి.భీమేశ్వర రవికుమార్, ఎస్‌ఐ సిహెచ్. చిన్నబాబులు సంఘటనా ప్రదేశానికి వచ్చి వివరాలు సేకరించారు. 48 ఉంగరాలు సుమారు 80 గ్రాముల పైగా బరువుంటాయనీ. నాలుగు లక్షల విలువ చేస్తాయని జ్యూయలర్స్ యజమాని యుగంధర్ తెలిపాడు. దీంతో అప్రమత్తమైన పోలీసు అధికారులు నిందితులను పట్టుకునేందుకు రంగంలోకి దిగారు. పోలీసు సిబ్బందిని అప్రమత్తం చేసి నిందితుల కోసం గాలింపు చేపట్టారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-హనుమాన్‌జంక్షన్ : రైలు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన అంపాపురం వద్ద శుక్రవారం చోటుచేస్తుంది. ఏలూరు రైల్వే ఎస్సై డి.నరసింహరావు తెలిపిన వివరాల ప్రకారం అంపాపురం-తేలప్రోలు రైల్వేస్టేషన్ల మధ్య రైలు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మతి చెందినట్లు తెలిపారు. అతనికి 30-35 సంవత్సరాల మధ్య ఉండవచ్చుని, నీలం రంగు టీషర్, కాఫీపొడి రంగు ఫ్యాంటు ధరించి కోలముఖం, తెలుపుదాయ కలిగి, ఉన్నాడని, ఎత్తు సుమారు 5.6 అడుగులు ఉండవచ్చని వివరించారు. ప్రమాదంలో మృతదేహం ముక్కలయిందని, మతదేహాన్ని పోస్టుమారం నిమిత్తం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రమాదం జరిగిన తీరు, తదితర విషయాలపై దర్యాప్తు చేస్తున్నటు రైల్వే ఎస్సై నరసింహారావు తెలిపారు. మృతుని వివరాలు తెలిసిన వారు ఏలూరు రైల్వే పోలీసులను సంప్రదించాలన్నారు.

గాయపడ్డ వ్యక్తి మృతి

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ లోని ప్రధాన రహదారి చింత చెట్టు సెంటర్లో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ఎలవర్తి నాగరాజు(45) గుంటూరు ఓ ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందాడు. నాగరాజు రోడ్డు దాటుతుండగా టిప్పర్ ఢీకొనడంతో ఆయన ఎడమ కాలు నుజ్జునుజ్జయింది. దీనితో వైద్యులు మోకాలు వరకు కాలు తీసివేసినట్లు బంధువులు తెలిపారు. కాగా వైద్యశాలలో చికిత్స పొందుతున్న నాగరాజుకు శుక్రవారం ఉదయం వైద్యశాలలో చికిత్స హఠాత్తుగా గుండెపోటు రావడంతో మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. ఇప్పటికే ప్రమాదానికి కారణమైన వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నా మనీ ఎస్సై రమేష్ తెలిపారు.

ఆభరణాలు, నగదు చోరీ

ప్రజాశక్తి - మొవ్వ : వైద్యం కోసం ఆసుపత్రికి వెళ్ళి తిరిగి ఇంటికి వచ్చేలోపు ఇంటికి వేసిన తాళం విరగొట్టి ఇంట్లోని బంగారు ఆభరణాలు, నగదు చోరీకి గురైన సంఘటన కూచిపూడి పోలీసు స్టేషను పరిధిలోని పెదపూడిలో చోటుచేసుకుంది. స్ధానికంగా కలకలం రేకెత్తించిన ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెదపూడి గ్రామానికి చెందిన బుగ్గ సత్యనారాయణ తన భార్యకు అనారోగ్యం ఉన్నందున మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లినట్లు తిరిగి మధ్యాహ్నం 1:45 గంటలకు తిరిగి రాగా ఇంటికి వేసిన తాళం పగలగొట్టి లోపల ఉన్న బంగారు వస్తువులు సుమారు 30 గ్రాములు బంగారంతో పాటు 10,000రూపాయల నగదును ఎవరో గుర్తుతెలియని దొంగలు దొంగలించకపోయారని బాధితుడు దుర్గా సత్యనారాయణ కూచిపూడి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కూచిపూడి ఎస్సై డి. సందీప్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు .మచిలీపట్నం క్లూస్ టీమ్ ను రంగంలోకి దించి దర్యాప్తు వేగవంతం చేశారు.

గరికపాటి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

గరికపాటి రాజారావు వర్ధంతి

ప్రజాశక్తి - తిరువూరు : ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో ప్రజా కళాకారుడు, ప్రజానాట్యమండలి నాయకులు గరికపాటి రాజారావు వర్ధంతి తిరువూరు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రజానాట్య మండలి నాయకులు కార్యకర్తలు శుక్రవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రజా నాట్య మండలి తిరువూరు డివిజన్ మాజీ కార్యదర్శి సాంబారు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ డాక్టర్ గరికపాటి రాజా రావు సినీ దర్శకత్వంలో అనేక కళా సంస్థలను తయారుచేసి ప్రజా ఉద్యమానికి తోడ్పడ్డారని తెలిపా రు. ప్రజలు ఎదుర్కొనే ప్రజా సమస్యల మీద కళా సంస్థ లు పనిచేస్తున్నాయన్నారు. ఈకార్యక్రమంలో మహిళా సంఘం జిల్లా నాయకులు సానికొమ్ము కుమారి, అధ్యక్ష, కార్యదర్శులు మరకాల మరియమ్మ, మునిగంటి లక్ష్మి, నాయకురాళ్ళు పంతంగి తులసీరాని, మేడిపల్లి నాగమ ణి, ఇంజం రాజేశ్వరి, లత, విజయలక్ష్మి, ప్రజానాట్య మండలి, ఎస్. కె.దాదు, కూరపాటి వెంకటరత్నం, ఆకుల రవి, బలగాని వెంకటేశ్వరరావు, దమ్మాలపాటి శివరా మకష్ణ, కడిమి పాపరావు పాల్గొన్నారు.

మైలవరం పంచాయతీ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న పంచాయతీ కార్మికులు, మద్దతిస్తున్న సిఐటియు నాయకులు

పంచాయతీ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి మైలవరం : మైలవరం గ్రామపంచాయతీలో మూడు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి సిహెచ్.సుధాకర్ మాట్లాడుతూ మూడు సంవత్సరాలుగా పంచాయతీ కార్మికులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో విఫలమయ్యారన్నారు. మూడు సంవత్సరాల నుండి కార్మికులకు ఇవ్వాల్సిన ఏరియర్స్ ఇప్పటివరకు ఇవ్వలేదని కొంతమంది కార్మికులను తొలగిస్తున్నారని అన్నారు. ధర్నా వద్దకు చేరుకున్న సర్పంచ్, ఉప సర్పంచ్, ఎంపిటిసిలు సిఐటియు నాయకులు కార్మికులతో చర్చలు జరిపారు. ఈ నెల 25 తేదీలోపు యూనిఫామ్ తదితర సమస్యలను తీరుస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎర్రం శెట్టి వీరమ్మ, రవి, భవాని, ఉమా, మల్లేశ్వరి, రామకష్ణ తదితరులు పాల్గొన్నారు.

గొడవలు సృష్టిస్తున్నారు

ప్రజాశక్తి - తిరువూరు : పాదయాత్రకు జనం రాకపోవడంతో రౌడీలను తీసుకొచ్చి గొడవలు, హింస సష్టించి లబ్ధిపొందాలని చంద్రబాబునాయుడు ప్రయత్నం చేస్తున్నారని, ఆయన ప్రయత్నాన్ని ప్రజలు తిప్పి కొడతారని ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి అన్నారు. తిరువూరులోని తన కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ లోకేష్ పాదయాత్ర ప్రజాదరణ కోల్పోవడంతో తండ్రీకొడుకులు సహనం కోల్పోయి ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ ప్రశాంతంగా ఉన్న రాష్ట్రాన్ని నాశనం చేస్తున్నారని ఆరోపించారు. పాదయాత్ర ఎవరైనా చేసుకోవచ్చని, ప్రజల నుండి విజ్ఞప్తులు స్వీకరించవచ్చని అన్నారు. జగన్మో హన్ రెడ్డి ప్రతిపక్ష నాయకుడిగా చేసిన పాదయాత్రలో ఒక్క గొడవ కూడా జరగలేదని, ప్రజలు వచ్చి తమ సమస్యలను తెలుపుకున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి, ఎంపిపి గద్దల భారతి, నగర పంచాయతీ చైర్‌పర్సన్ గతం కస్తూరిబాయి, జడ్పిటిసి రామ చంద్రారెడ్డి, కౌన్సిలర్లు, వైసిపి పట్టణ అధ్యక్షులు చలమాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రైల్వే కాంట్రాక్టు కార్మికుల పోరాటం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : విజయవాడ రైల్వే స్టేషన్లో రక్షక్, పద్మావతి కాంట్రాక్ట్ సంస్థలు పని నుండి తొలగించిన కాంట్రాక్ట్ కార్మికుల న్యాయపోరాటం 56వ రోజుకు చేరింది. కాంట్రాక్టర్లు అన్యాయంగా, చట్ట విరుద్ధంగా పనుల నుండి నిలిపివేయబడ్డ కాంట్రాక్ట్ కార్మికులను వెంటనే పనిలోకి తీసుకొని వాళ్ల ఉపాధిని కాపాడాలని శుక్రవారం కూడా మస్టర్ పాయింట్ వద్ద కార్మికులు నిర్వహించిన ధర్నాలో సిఐటియు ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు ఏ వెంకటేశ్వరరావు పాల్గొని రైల్వే అధికారులను కోరారు. కాంట్రాక్టర్ తీవ్రమైన నిర్లక్ష్యాన్ని ప్రదర్శించి చట్ట వ్యతిరేకంగా కార్మికుల ఉపాధిని దెబ్బతీసి అధిక లాభాల కోసం ప్రయత్నిస్తుంటే, చట్టాన్ని అమలు చేయాల్సిన రైల్వే అధికారులు మాత్రం కార్మికులను పని ఇప్పించలేక పోవటం అన్యాయం అన్నారు. రైల్వే స్టేషన్లో ఎంతమంది పనికి అవసరమో రైల్వే అధికారులే సూచించాలని జీవో ఉన్నప్పటికీ రైల్వే అధికారులు కాంట్రాక్టర్ అనుకూలంగా వ్యవహరించడం సరికాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ జీవోను అనుసరించి కార్మికులకు పని కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఈ.వి. నారాయణ, కార్మికులు పాల్గొన్నారు.

పనిలోకి తీసుకోవాలని డిఆర్ఎం కార్యాలయం వద్ద రైల్వే కాంట్రాక్టు కార్మికులు నిరసన

విద్యుత్ బిల్లులు సక్రమంగా ఇవ్వాలి

ప్రజాశక్తి- నందిగామ : నందిగామ పట్టణంలోని విద్యుత్ శాఖ కార్యాలయంలో విజయవాడ పార్లమెంట్ సభ్యులు, దిశ కమిటీ చైర్మన్ కేశినేని శ్రీనివాస్ నాని ఆదేశాలనుసారం ప్రజలు, రైతులపై విద్యుత్ ఛార్జీలపై ఎలను కలిసినట్లు ఎన్టీఆర్ జిల్లా డెవలప్‌మెంట్ కోఆర్డినేషన్ మానిటరింగ్ కమిటీ సభ్యులు, హైకోర్టు న్యాయవాది ఎక్కిరాల హనుమంతరావు తెలిపారు. శుక్రవారం ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. విద్యుత్ పెంపుదలపై, ట్రూఅప్ ఛార్జీలు, ఎలక్ట్రికల్ కంపెనీల అధిక వసూలను నిలువరించి, విద్యుత్ వాడిన యూనిట్ల ప్రకారం, విద్యుత్ బిల్లును తీసుకోవాలని కోరారు.

విద్యుత్ కార్మికులకు కార్మిక లోకం పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి ఇబ్రహీంపట్నం : సిఐటియు రాష్ట్ర కమిటీ ప్రచురించిన కార్మిక లోకం పుస్తకాల పంపిణీ కార్యక్రమం ఎన్‌టిటిపిఎస్ గేట్ ఎదురుగా చేపట్టారు. విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని నష్టదాయకమైన నూతన వేతన ఒప్పందం రద్దు చేయాలని, ఐటీఐల విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల పట్ల రాష్ట్ర ప్రభుత్వ మొండి వైఖరి విడాలని, కాంట్రాక్టు కార్మికులను బేషరతుగా పర్మినెంట్ చేయాలని విశ్లేషణ చేస్తూ అందించిన ఈ పుస్తకాలను కార్మికులు స్వచ్ఛందంగా తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు విటిపిఎస్ నాయకులు వేముల నాగరాజు , వల్లభనేని సతీష్ శ్రీనివాసరావు, రాజేష్ వెంకటేష్ పాల్గొన్నారు.

లబ్ధిదారులకు సిఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ పట్టణంలోని వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన రూ.4.65 లక్షల విలువ గల చెక్కులను లబ్ధిదారులకు నందిగామ శాసనసభ్యులు మొండితోక జగన్ మోహన్ రావు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ నిరుపేదలకు వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. నందిగామ నియోజకవర్గంలో సీఎంఆర్ఎఫ్ ద్వారా ఇప్పటివరకు 415 మంది లబ్ధిదారులకు రూ.2.18 కోట్లను అందజేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

మురుగు కాలువ సమస్యపై స్పందించిన మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: పట్టణ పరిధిలో జెఆర్‌సి కాలేజీ దగ్గరలో గల మురుగు కాలువ సమస్యపై శుక్రవారం మున్సిపల్ చైర్ పర్సన్ రంగాపురం రాఘవేంద్ర స్పందించారు. పత్రికలలో, సోషల్ మీడియాల ద్వారా వైరల్ అవుతున్న జెఆర్‌సి కాలేజీ వద్ద ఉన్న మురుగు కాలువ సమస్యపై మున్సిపల్ చైర్ పర్సన్ రంగాపురం రాఘవేంద్ర స్పందించి అక్కడ మురుగు కాలువ నిర్మాణానికి ముందస్తుగా పరిసర ప్రాంతంలో ఉన్న మురుగుని సెప్టిక్ ట్యాంక్ ద్వారా తొలగించి, వెంటనే మురుగు నీటి కాలువ నిర్మించి సమస్యకు పూర్తి పరిష్కారానికి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకరరావు, ఎ ఈ హనుమంతరావు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టీచింగ్ మెటీరియల్ అందజేత

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: మండలంలోని గండ్రాయి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల మెయిన్‌కు ప్రవాస భారతీయులు వాసుబాబు తానా (తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా) సభ్యులు విద్యార్థులకు అవసరమైన టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్‌ను (సుమారు 25 వేల రూపాయల విలువగల) గండ్రాయి గ్రామస్తులు ప్రస్తుతం హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న బొమ్మిశెట్టి శ్రీనువాసరావు పదమూడు వేల రూపాయల విలువ గల ఇనుప బీరువాను మండల విద్యాశాఖాధికారి ఎల్ చిట్టిబాబు చేతుల మీదుగా పాఠశాలకు అందజేశారు. ఈ సందర్భంగా చిట్టిబాబు మాట్లాడుతూ సహృదయంతో దాతలు అందిస్తున్న సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు నేలవెల్లి.రమేష్ దాతలకు కతజ్ఞతలు తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్ బాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామస్తులు రాంబాబు, రాజేంద్ర, ఉపాధ్యాయులు జ్యోతికుమారి, సుబ్బారావు, రమాదేవి, దేవదానం, ముక్తేశ్వరరావు, కష్ణంరాజు పాల్గొన్నారు.

బీరువా అందజేస్తున్న తానా సభ్యులు

సీజనల్ వ్యాధులపై అవగాహన ఉండాలి: కమిషనర్

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ పట్టణ పరిధిలో 8వ వార్డులో శుక్రవారం మున్సిపల్ కమిషనర్ డాక్టర్ ఎస్.జయరాం పర్యటించారు. వార్డులో దోమల నివారణకు జరుగుతున్న వెక్టార్ కంట్రోల్ మెడస్‌లో జరుగుచున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని హెల్త్ సెక్రెటరీలు, శానిటరీ సెక్రెటరీలు కలిసి నిర్వహించాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని, జనావాస పరిసర ప్రాంతాల్లో మురుగు నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో దోమల మందు పిచికారీ, ఆయిల్ బాల్స్ వేయించాలని సూచించారు. ఈ సందర్భంగా వార్డులో జరుగుచున్న డే ఫాగింగ్ పరిశీలించారు. ఈ కార్యక్రమములో కో ఆప్షన్ సభ్యులు మన్నం దాసు, 8వ వార్డ్ ఇన్చార్జి గుడివాడ సాంబ శివరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నందిగామ 8వ వార్డులో పర్యటిస్తున్న కమిషనర్ జయరామ్

సిపిఎం సభ్యులు నారాయణ మృతి

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : రెడ్డిగూడెం మండల పరిధిలోని రంగాపురం గ్రామ పంచాయతీ శివారు బూరుగ గూడెం గ్రామానికి చెందిన సిపిఎం సీనియర్ నాయకులు వెలిశల నారాయణ (65) గురువారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. నలభై సంవత్సరాలుగా సిపిఎం పార్టీ సభ్యునిగా ఉంటూ, పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవారు. పార్టీ మండల కార్యదర్శి జంగా వెంకటరెడ్డి, సీనియర్ నాయకులు మాధవరెడ్డి, కష్టారెడ్డి, అప్పిరెడ్డి పార్టీ జెండాను కప్పి నివాళులర్పించారు. నారాయణకు నలుగురు సంతానం, భార్య ఉన్నారు.

న్యాయవాదులపై దాడికి ఖండన

ప్రజాశక్తి - తిరువూరు : ఉత్తరప్రదేశ్‌లోని న్యాయ వాదులపైన అమానుషంగా, దౌర్జన్యకరంగా పోలీసులు చేసిన దాడిని ఖండిస్తూ తిరువూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయ వాదులు కోర్టు విధులను బహిష్కరించి కోర్టు బయట నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సంకురాత్రి జనార్ధనరావు, అంకిరెడ్డి అంజన రెడ్డి, న్యాయవాదులు రాజవరపు శ్రీనివాస రావు, మేకల నాగేంద్ర ప్రసాద్, చింతల వెంకటరెడ్డి, మర్రికట్ల కుమార్, అత్తునూరు శ్రీనివాసరావు, కొత్తపల్లి ఆనంద స్వరూప్, వాకదాని లక్ష్మీనారాయణ, రాజు, రాంబాబు, రామారావు, మురహరి పాల్గొన్నారు.

విద్యతో వికాసం

ప్రజాశక్తి - తిరువూరు : విద్య ద్వారానే మనిషిలో నిజమైన వికాసం కలుగుతుందని గానుగపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానో పాధ్యాయులు ఇన్‌ఛార్జి ఎం.వి.సాయిరాం అన్నారు. అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా పాఠశాలలో విద్య ప్రాముఖ్యతపై శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఉన్నత విద్యను అభ్యసించాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఉపాధ్యాయులు రాజేంద్ర ప్రసాద్, రాంప్రదీప్, రామారావు, సుదర్శన్, సాంబశివ రావు, వెంకటేశ్వర్లు, రాము తదితరులు పాల్గొన్నారు.

కుట్టు శిక్షణా కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి తిరువూరు : మహిళలు స్వయం శక్తితో ఎదిగి ఆర్థికంగా అభివద్ధి చెందాలని సత్యం నర్సింగ్ హోమ్ వజ్రాలు వైద్యురాలు మధు కీర్తి అన్నారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రం అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం సంయుక్త ఆధ్వర్యంలో తిరువూరు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన కుట్టుమిషన్ శిక్షణ కేంద్రాన్ని శుక్రవారం ఆమె ప్రారంభించారు ఈ సందర్భంగా మధుకీర్తి మాట్లాడుతూ భార్య, భర్తలు పని చేస్తేనే కుటుంబం సాఫీగా కొనసాగుతుందని తెలిపారు. మహిళలు కుట్టు మిషన్ నేర్చుకొని కుటుంబానికి ఆసరాగా నిలబడాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర నాయకులు ఎస్. కుమారి, మండల అధ్యక్ష, కార్యదర్శులు మరకాల మరియమ్మ, మునిగంటి లక్ష్మి, నాయకులు పంతంగి తులసీరాని, ఎం.నాగమణి, రాజేశ్వరి, సుందరయ్య విజ్ఞాన కేంద్రం కన్వీనర్ కడిమి పాపారావు, ప్రజా సంఘాల నాయకులు పంతంగి శ్రీనివాసరావు, ఆకుల రవి, సాంబారు వెంకటేశ్వర్లు, బి.వెంకటేశ్వరరావు కె.వి.రత్నం, ఎస్. కె. దాదు జాన్మియా తదితరులు పాల్గొన్నారు.

జానపద కళలకు జవసత్వాలు నింపిన గరికపాటి

- ప్రజానాట్యమండలి వ్యవస్థాపకులు డాక్టర్ రాజారావు వర్ధంతిలో నేతలు

ఉయ్యూరులో...

పోరంకిలో...

ప్రజాశక్తి-ఉయ్యూరు : కళ కళ కోసం కాదు ప్రజల కోసం అనే నినాదంతో ప్రజల్లో చైతన్య నింపడానికి ఆనాడు ప్రజానాట్యమండలి ఏర్పడిందని జిల్లా అధ్యక్షుడు కంభం కొండల బాబు అన్నారు. శుక్రవారం ప్రజానాట్యమండలి ఆధ్యుడు, వ్యవస్థాపకులు డాక్టర్ గరికపాటి రాజారావు 60 వ వర్ధంతి సభ ఉయ్యూరులోని శ్రామిక భవనంలో ఏర్పాటుచేసిన సభలో కొండలు మాట్లాడుతూ ఎన్నో జానపద కళలు ప్రజా కళలుగా రూపాంతరం చెందాయని ఎందరో ప్రజా కళాకారులు తమ జీవితాలను కళ లకే అంకితం చేశారని, అలాంటి వారిలో తెలుగు నాట డాక్టర్ గరికపాటి రాజారావు ముందు వరుసలో ఉంటారన్నారు. ప్రజా కళాతపస్విగా ప్రజా రంగస్థలం ప్రయోక్తగా పేరుగాంచారని కొనియాడారు. తొలుత రాజారావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సభ్యుడు కంభం ప్రభుదాస్ బి రాజేష్ బి కీర్తి తదితరులు పాల్గొన్నారు. **కంకిపాడు :** డాక్టర్ గరికపాటి రాజారావు వర్ధంతి సభ పోరంకిలో శుక్రవారం జరిగింది. ముందుగా రాజారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రజానాట్య మండలి కృష్ణా జిల్లా కార్యదర్శి షేక్ ఖాసిం అధ్యక్షతన జరిగిన సభలో ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు పి. మంగరాజు మాట్లాడుతూ శరీరం లోని రోగాలను నయం చేయడానికి డాక్టర్ ఎంత అవసరమో సమాజంలోని రుగ్మతలను నయం చేయడానికి యాక్టర్ కూడా అంతే అవసరం అని చాటి చెప్పిన మహోన్నత వ్యక్తి డాక్టర్ రాజారావు అని తెలిపారు. తెలుగు నాటక రంగ చరిత్రలో రాజారావు పాత్ర చాలా కీలకమైనది అని అన్నారు. వీర తెలంగాణ రైతాంగ పోరాటానికి మద్దతు గా రాజారావు రూపొందించిన మా భూమి, ముందడుగు వంటి నాటకాలు ప్రజల్ని ఉర్రూతలూగించాయి అని అన్నారు.

గన్నవరం మండలం అల్లాపురంలో...

స్వాతంత్ర్య పోరాటంలో తన ప్రాణాల్ని కూడా తణప్రాయంగా అర్పించిన మన్య విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు చరిత్రను నాటకంగా రూపొందించి దర్శకత్వం వహించి వాడవాడలా విస్తత ప్రచారం చేసిన ఘనత రాజారావు గారిదేనని తెలిపారు. అంతరించి పోతున్న జానపద కళారూపాలు వెలికితీసి జవసత్వాలు నింపేందుకు నిరంతరం కృషి చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో అనుములు ప్రభాకర్, ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి అనిల్ కుమార్, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి నార్ల వెంకటేశ్వరరావు, విజయకుమార్, మున్నంగి నరసింహారావు, సిఐటియు నాయకులు త్రిమూర్తులు, మహిళా సంఘం నాయకురాలు లక్ష్మి, డివై ఎఫ్ఐ నాయకులు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. **ప్రజాశకి-గన్నవరం :** గన్నవరం మండలం అల్లాపురం గ్రామంలో శుక్రవారం రాత్రి గరికపాటి రాజారావుకి 60 వర్ధంతి సందర్భంగా రాజారావు చిత్రపటానికి మాధవరపు నాగరాజు పూలమాలవేసి జోహార్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు కొండల బాబు ఉయ్యూరు డివిజన్ కార్యదర్శి కె ప్రభుదాసు ప్రజానాట్ జిల్లా కమిటీ సభ్యులు మల్లంపల్లి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఎరువులను అందుబాటులో ఉంచాలి

ప్రజాశక్తి ఉయ్యూరు : రైతుభరోసా కేంద్రాల్లో యూరియా, పోటాష్ ఎరువులు అందుబాటులో ఉంచాలని ఉయ్యూరు ఏఎంసీ చైర్మన్ వల్లభనేని వెంకటేశ్వరరావు సూచించారు. మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో శుక్రవారం మండల వ్యవసాయ సలహామండలి సమావే శంలో పలువురు సభ్యులు పలు సూచనలు చేశారు. ఈ-క్రాప్ నమోదు గడువు సెప్టెం బరు 15తో ముగియనున్న నేపథ్యంలో వేగిరం చేసి ఈకేవైసీ పూర్తి చేయాలన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ సమయంలో డొంకరోడ్లు సరిగాలేని చోట గ్రావెల్తోలి రవా ణాకు ఇబ్బంది లేకుండా చూడాలని, చనిపోయిన పశువులకు పశుసంవర్ధక శాఖ ద్వారా ఇన్సూరెన్స్ అందడం లేదని ఆందోళన వ్యక్తంచేశారు. జలకళ పథకం ద్వారా మోటార్లు, కరంటు కనెక్షన్లు ఇవ్వలేదని సభ్యులు ఆందోళన వ్యక్తంచేశారు.. మండలవ్యవ సాయ అధికారి నిస్సీగ్రేస్, డీటీ ఈడె శ్రీధర్, ఎంపీడీవో విమాదేవి, పశుసంవర్ధక అధి కారి శ్రీకాంత్, జిల్లా వ్యవసాయ సలహామండలి సభ్యుడు గొల్లపూడి వేణుబాబు, నంద జోగేశ్వరరావు, సుమన్ కుమార్ పాల్గొన్నారు.

స్కాలర్ షిప్ అందజేస్తున్న కేసీపీ యూనిట్ హెడ్ సీతారామదాస్

విద్యతో అభివృద్ధి సాధ్యం

ప్రజాశక్తి-ఉయ్యూరు : విద్యతో సమాజాభివద్ధి సాధ్యమని ప్రతిబ కలిగిన పేద విద్యార్థులను ప్రోత్సహించడం ద్వారా విద్యాభివద్ధికి రోటరీ కమ్యూనిటీ సర్వీస్ ట్రస్ట్ చేస్తున్న సేవలు అభినందనీయమని కేసీపీ చక్కెర కర్మాగార ఉయ్యూరు యూనిట్ హెడ్ యలమంచిలి సీతారామదాస్ అన్నారు. ఇంజనీరింగ్ చదువుతున్న ఇద్దరు విద్యార్థినిలు వై.భావన, యజ్ఞశ్రీ తలితండ్రులకు రూ.30వేల చెక్కులు శుక్రవారం అందజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ కష్టపడి విద్యనభ్యసించి ప్రయోజకులై తలితండ్రులు, జన్మించిన గ్రామానికి పేరు ప్ర ఖ్యాతులు తేవాలన్నారు. నాలుగు దశాబ్దాలుగా రోటరీ సర్వీస్ ట్రస్ట్ ద్వారా, రోటరీక్లబ్ అనేక సేవాకార్యక్రమాలు చేస్తూ ముందంజలో ఉండటం అభినందనీయమన్నారు. రోటరీ సర్వీస్ట్రస్ట్ సెక్రటరీ సీకే వసంతరావు, డీజీఎం ఫైనాన్స్ సంపత్కుమార్, రోటరీ క్లబ్ సెక్రటరీ సీహెచ్ నాగసుబ్రమణ్యం ఇతర సభ్యులు పాల్గొన్నారు.

ఉచిత ఫిజియోథెరపీ శిబిరం

ప్రజాశక్తి - మచిలీపట్నం అర్బన్ : ఫిజియోథెరపీ డే సందర్భంగా శుక్రవారం స్థానిక అమ్మ ఫిజియోథెరపీ క్లినిక్లో ఉచిత ఫిజియోథెరపీ క్యాంప్ నిర్వహించారు. పలువురు వైద్యసేవలు వినియోగించు కున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎల్ ప్రభాకర్ మాట్లాడుతూ ఫిజియోథెరపీలో అత్యాధునిక వైద్య పరికరాలు వినియోగి స్తున్నామని తెలిపారు. రోబోటిక్ హ్యాండుతో వైద్యచికిత్సలు అందిస్తున్నామని చెప్పారు. దీంతో పక్షవాతం వచ్చిన వారికి చేతి వేళ్ళు సులభంగా వినియోగంలోకి వచ్చేందుకు దోహద పడుతుందన్నారు. నడవలేని వారికి అన్వాగింగ్ సిస్టం ద్వారా నడిపించవచ్చన్నారు. స్పాండలైటీస్, సయాటిక, నడుంనొప్పి, మెడనొప్పికి కిరోప్రాక్టిక్ విధానంతో చికిత్స అందించ వచ్చని తెలిపారు . ఈ క్యాంపులో డా. జి సత్య కీర్తి, చంద్రశేఖర్, పావని, లక్ష్మీ, సిబ్బంది పాల్గొన్నారు.

11 నుంచి ఆటల పోటీలు

ప్రజాశక్తి-అవనిగడ్డ : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా స్కూల్ గేమ్స్ ఆంధ్ర ప్రదేశ్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ క్యాలెండర్ ను అనుసరించి అవనిగడ్డ మండల స్థాయి ఆటల పోటీలు సోమవారం నుండి ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో ప్రారంభిస్తున్నట్లు ఎంఈఓ ఎన్ శివ శంకర్ రావు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండల స్థాయిలో నిర్వ హించే ఈ పోటీలను 11వ తేదీ ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతాయని, దీనిలో భాగంగా కబడ్డీ కోకో వాలీబాల్ త్రో బాల్ టెన్నికాయిట్ బాల్ బ్యాడ్మింటన్ యోగ బ్యాట్మెంటన్(షటిల్) అతలేట్క్స్ అండర్ 14 అండర్ 17 బాల బాలికలకు పోటీలతోపాటు సెలక్షన్ కూడా జరుగుతుందని చెప్పారు. అందువల్ల మండలంలోని ప్రతి ప్రభుత్వ ప్రైవేట్ స్కూల్ విద్యార్థులు పాల్గొనవచ్చునని పోటీలలో పాల్గొనే విద్యార్థులు ఆయా పాఠశాలలలో ఎస్ జి ఎఫ్ ఐ ఆన్లైన్ లో తప్పక రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని చెప్పారు. మరిన్ని వివరాల కొరకు మండల స్పోర్ట్స్ ఇంచార్జ్ మునగాల ఉదయ్ కుమార్ సెల్ నెంబర్ 9885750 875, 9494530568 సనకా శ్రీకాంత్ సెల్ నెంబర్లకు ఫోన్ చేసి సంప్రదించాలని ఎంఈఓ ఎన్ శివశంకర్ రావు తెలిపారు

ప్రపంచ అక్షరాస్యతా దినోత్సవం

ప్రజాశక్తి-ఉయ్యూరు : ప్రపంచ అక్షరాస్యతా దినోత్సవం పురస్కరించుకుని ఉయ్యూరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆకునూరు ప్రభుత్వం పాఠశాలలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. అక్షరాస్యత ఆవశ్యకత, విద్యప్రాముఖ్యత, మాతభాష గొప్పదనాన్ని క్లబ్ అధ్యక్షుడు ఇస్మా యిల్ తెలియజేశారు. ఈసందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎన్. సలోమిని సత్కరించారు. అనంతరం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు.

ఏడుగురు ఎస్ఐలు బదిలీ

ప్రజాశక్తి - మచిలీపట్నం అర్బన్ : జిల్లాలో ఏడుగురు ఎస్ఐలను బదిలీ చేస్తూ జిల్లా ఎస్పీ పి జాషువా శు క్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వీఆర్ ఉన్న విశ్వంత్ తోట్లవల్లూరుకు, కంకిపాడు ఎస్ఐ లక్ష్మి స్పెషల్ బ్రాంచుకు, పెనమలూరు ఎస్ఐ అర్జునరాజు మచిలీపట్నం టౌనుకు, వీఆర్లో ఉన్న మాణిక్యాలమ్మ దిశ మహిళా పోలీస్ స్టేషనుకు, చిలకలపూడి ఎస్ఐ కిషోర్ కుమార్ పమిడిముక్కల స్టేషనుకు బదిలీ చేయగా, తోట్లవల్లూరు ఎస్ఐ జి రమేష్ ను వీఆర్కు పంపారు.

సిరివెన్నెల సాహిత్యాన్ని విశ్వవ్యాప్తం చేయాలి

ప్రజాశక్తి-అవనిగడ్డ : సినీ గేయ రచయిత కీర్తిశేషులు పద్మశ్రీ డాక్టర్ సిరివెన్నెల సీతారామశాస్త్రి సమగ్ర సాహిత్యాన్ని విశ్వవ్యాప్తం చేయాలని తానా మాజీ అధ్యక్షులు డాక్టర్ తోటకూర ప్రసాద్ తెలిపారు. శుక్రవారం అవనిగడ్డ విచ్చేసిన ఆయన మాజీ ఉపసభాపతి మండలి బుద్ధ ప్రసాద్ నివాసానికి విచ్చేసి బుద్ధ ప్రసాద్కు సిరివెన్నెల సాహిత్యా గ్రంధాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ తానా సంస్థ ఆధ్వర్యంలో సిరివెన్నెల పాటలు ఆయన రాసిన మొదటి సినిమా సిరివెన్నెల నుండి ఆయన మరణానంతరం విడుదలైన రంగమార్తాండ సినిమాలోని పాటల వరకు ప్రతి పాట ప్రతి కవిత ప్రతి నాటిక నాటక ములను అన్నిటినీ ఒకచోట చేర్చి ఆరు సంపుటాలుగా ముద్రించడం జరిగిందన్నారు. ఎవరైనా సినీ సాహిత్యం పై పరిశోధన చేయాలంటే అన్ని విషయాలు ఒక చోట లభించాలని తలంపుతో సిరివెన్నెల సాహిత్యాన్ని గ్రంథాలయాలలో విశ్వవిద్యాలయాల లో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇప్పటికే సిరివెన్నెల అభిమానులకు అందించడం జరిగిందని, అమెరికాలో సైతం సిరివెన్నెల సాహిత్యాన్ని లభించేలా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. తానా చరిత్రలో ఒక

తోటకూరప్రసాద్ తదితరులను సన్మానిస్తున్న బుద్ధప్రసాద్

సువర్ణ అధ్యాయంగా పేర్కొంటూ కవికి ఇచ్చే గొప్ప నివాళి ఇది అని అన్నారు. ముఖ్యంగా సిరివెన్నెల సాహిత్యాన్ని గ్రంథరూపంలో తీసుకురావడానికి సహకరించిన వారి కుటుంబ సభ్యులకు తానా ఇప్పటి అధ్యక్షులు అంజయ్య చౌదరికి కార్యవర్గ సభ్యులకు తానా కుటుంబ సభ్యులకు కతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం తెలుగు వేద కవి జోన్నవిత్తుల రామాలింగేశ్వరరావు, తెలుగు అవదాని డాక్టర్ పాలపర్తి శ్యామలానంద ప్రసాద్, పద్య కవి వామరాజు సత్యమూర్తిలకు సిరివెన్నెల సాహిత్య గ్రంధాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా ఉపాధ్య క్షులు మండలి వెంకట్రాం, బుద్ధ ప్రసాద్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు

ప్రతి బుధ, శుక్రవారాల్లో 'జగనన్నకు చెబుదాం' : కలెక్టర్

ప్రజాశక్తి-కలక్టరేట్ (కష్ణా) : ప్రజల సమస్యలు పరిష్కరించి, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల పట్ల సంతప్తి స్థాయిని పెంపొందించేందుకు "జగనన్నకు చెబుదాం" కార్యక్రమం అమలు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి రాజాబాబు పేర్కొన్నారు. ఇక నుంచి ప్రతి బుధవారం, శు క్రవారాలలో ముందుగా నిర్ణయించిన షెడ్యూలు ప్రకారం జిల్లా వ్యాప్తంగా మండల కేంద్రాల్లో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లా కలెక్టర్ శుక్రవారం కలెక్టరేట్లో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జగనన్నకు చెబుదాం కార్యక్రమాలు ప్రతి బుధవారం శుక్రవారం లలో మండల కేంద్రాల్లో నిర్వహించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమం కింద జిల్లాలో ఇప్పటివరకు అందిన 6,800 అర్జీలలో 5,110 పరిష్కరించినట్లు, మిగతావి వివిధ పరిష్కార దశల్లో ఉన్నాయని కలెక్టర్ వివరించారు. మండల కేంద్రాల్లో నిర్వహించే జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. ఉదయం నుండి సాయంత్రం వరకు జిల్లా అధికారులు మండలంలోనే ఉండి వచ్చిన అర్జీలపై పరిష్కార చర్యలు తీసుకుంటారన్నారు. ఆయా మండలాలకు చెందిన ప్రజలు ఈ విషయం గమనించి, వారి మండలాల్లో జగనన్నకు చెబుదాం నిర్వహించే తేదీలలో వారి సమస్యలపై అర్జీలు అందజేయాలని కలెక్టర్ తెలిపారు.అలాగే ప్రతి సోమవారం జిల్లా కలక్టర్ కార్యాలయంలో నిర్వహించే స్పందన కార్యక్రమం యధావిధిగా జరుగుతుందన్నారు.ఈ సందర్భంగా సెప్టెంబర్ నెలలో జరిగే షెడ్యూల్ను కలెక్టర్ ప్రకటించారు. సెప్టెంబర్ 13వ తేదీన గన్నవరం నియోజకవర్గంలో ఉంగుటూరు, 15వ తేదీ అవనిగడ్డ నియోజకవర్గంలో కోడూరు, 20వ తేదీ పామర్రు నియోజకవర్గంలో మొవ్వ, 22వ తేదీ పెనమలూరు నియోజకవర్గంలో ఉయ్యూరు, 27వ తేదీ గుడివాడ నియోజకవర్గంలో నందివాడ, 29వ తేదీ పెడన నియోజకవర్గంలో కత్తివెన్ను, అక్టోబర్ 4వ తేదీ మచిలీపట్నంలో ఆయా మండల కేంద్రాల్లో జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించుటకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఉదయం 10:30 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు అర్జీలు స్వీకరించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో డి ఆర్ ఓ ఎం వెంకటేశ్వర్లు, కె ఆర్ ఆర్ సి డిప్యూటీ కలెక్టర్ బి.శివ నారాయణరెడ్డి పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి : డిఆర్‌డిఎ పీడీ శ్రీనివాసరావు

ప్రజాశక్తి -విజయవాడ : రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందిపుచ్చుకుని స్వయం సహాయక సంఘాల మహిళలు ఆర్థికంగా ఎదగాలని డిఆర్‌డిఏ పీడీ కె.శ్రీనివాసరావు అన్నారు.

విజయవాడ రూరల్ మండలం పాతపాడు గ్రామంలో విజయ గ్రామైఖ్య సంఘంలోని ప్రభు సేవా స్వయం సహాయక సంఘ సభ్యురాలు వెంకట సునీతకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నున్న బ్రాంచ్ మంజూరు చేసిన 5 లక్షల 15 వేల రూపాయల విలువైన కంప్యూటర్ ఎంబ్రాయడరీ మిషన్‌ను డిఆర్‌డిఏ పీడీ కె. శ్రీనివాసరావు, గ్రామ సర్పంచ్ దేవగిరి సుజాత ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రైమ్ మినస్టర్ ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రామ్ (పియంఇజిపి) పథకంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం పియంఇజిపి, పియంఎస్‌యంఇ పథకాల ద్వారా 35 శాతం రాయితీతో అందిస్తున్నారన్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ జిల్లాలోని స్వయం సహాయక సంఘాల మహిళలు ఆర్థికంగా ముందుకు సాగేందుకు వైఎస్సార్ క్రాంతి పథకం ద్వారా బ్యాంకుల ద్వారా రాయితీతో కూడిన పలు యూనిట్లను మంజూరు చేస్తున్నారన్నారు. ఈ అవకాశాన్ని అర్హులైన సంఘ సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో విజయవాడ రూరల్ మండల ఏ.పి.యం చంద్ర శేఖర్, డిఆర్‌డిఏ ప్రాజెక్టు సిబ్బంది పాల్గొన్నారు.

మొదటిపేజీ తరువాయి

కౌలు రైతులకూ రుణాలు మంజూరు

వారిని ఆర్థికంగా బలోపేతం చేసే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం రూ.లక్ష నుంచి రూ.3 లక్షల వరకు రుణం మంజూరు చేసే విధంగా విశ్వకర్మయోజన పథకానికి రూపకల్పన చేసినట్లు చెప్పారు. బందరు పార్లమెంటు సభ్యులు వల్లభనేని బాలశౌరి మాట్లాడుతూ కౌలు రైతులందరికీ రుణాలను మంజూరు చేయడంలో తలెత్తే సమస్యలకు పరిష్కార మార్గాలు చూపేందుకుగాను ఆర్‌బిఐ, నాబార్డు, వ్యవసాయం, రెవెన్యూ అధికారులతో కమిటీని ఏర్పాటు చేయాలని కోరారు. త్వరలో అవనిగడ్డ, మచిలీపట్నం తదితర ప్రాంతాల్లో రుణమేళాలు నిర్వహించను న్నామని తెలిపారు. ఈ సమావేశంలో రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏజిఎం ఆర్.కె. హనుకుమారి, నాబార్డు ఏజిఎం మిలింద్ చౌసాల్కర్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిప్యూటి రీజనల్ మేనేజర్ ఎస్.. సంతోష్, ఎల్డీఎం టి.ఎస్ జయవర్ధన్, డిఆర్ డిఏ పీడీ ప్రసాద్, జిల్లా పరిశ్రమల మేనేజర్ ఆర్. వెంకట్రావు, టిడ్కో ప్రాజెక్టు మేనేజర్ బి. చిన్నోడు, జిల్లా వ్యవసాయశాఖాధికారిణి ఎన్. పద్మావతి పాల్గొన్నారు.

అంకితభావం ఉన్న అధికారి మోహన్‌కుమార్

నిర్వర్తిస్తూ విశేష సేవలందించారన్నారు. ఆయన పని చేసిన అన్ని శాఖలలోను తనదైన ముద్ర వేసి ఆయా పదవులకు పూర్తి న్యాయం చేశారన్నారు. జాయింట్ కలెక్టర్ డా. పి.సంపత్ కుమార్ మాట్లాడుతూ కష్టపడే తత్వం ఉన్న వారు విధి నిర్వహణలో తనదైన ముద్ర వేసుకుంటారని, వ్యక్తి పనిచేస్తేనే వ్యవస్థ పనిచేస్తుందని అన్నారు. అలాగే కష్టపడే తత్వం ఉన్న అధికారి మోహన్‌కుమార్ అని, ఆయనకు అప్పగించిన భాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తించి తనదైన ముద్ర వేసుకున్నారన్నారు. నగరపాలక సంస్థ మున్సిపల్ కమీషనర్ స్వప్నిల్ దినకర్ పుడ్కర్ మాట్లాడుతూ కలెక్టరేట్‌కు వెన్నుముకలాంటి అధికారి మోహన్‌కుమార్ అని కొనియాడారు. డిఆర్‌వో కె. మోహన్‌కుమార్ మాట్లాడుతూ అధికారిగా తన విధి నిర్వహణలో జిల్లా యంత్రాంగం అందించిన సహకారం మరువలేనిదని, వారు చూపిన ఆదరాభిమానాలు తనను ఎంతో ముగ్ధుడిని చేశాయన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా అధికారులు వారి ఉపన్యాసాలు, కవితలతో డిఆర్‌వోగా సేవలందించిన మోహన్‌కుమార్‌ను కొనియాడారు. వీడ్కోలు సభకు డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ జె. సునీత వాఖ్యాతగా వ్యవహరించారు. అనంతరం డిఆర్‌వో మోహన్‌కుమార్ ఆయన సతీమణి లక్ష్మి శశిరేఖను జిల్లా అధికారులు గజమాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ అదితి సింగ్, ఆర్‌డివోలు రవీంద్రనాద్, ప్రసన్నలక్ష్మి, డిఆర్‌డిఏ పిడి కె. శ్రీనివాసరావు, సిఇవో జ్యోతిబాసు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఇ రమణ, డియంఅండ్‌హెచ్‌వో డా. యం సుహాసిని, డిఇవో సివి రేణుక, గ్రామ వార్డు సచివాలయ ప్రత్యేక అధికారి కె. అనురాధ, కలెక్టరేట్ ఎలక్షన్ డిటి దుర్గాప్రసాద్, సివిల్ సప్లయిస్ డియం వెంకటేశ్వర్లు, డిఎస్‌వో మోహన్‌బాబు, యంపిడివో శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

చైతన్య విద్యా సంస్థల ఆధ్వర్యంలో

ఏకత్వ సిబిఎస్‌సి స్కూల్‌కు శంకుస్థాపన

ప్రజాశక్తి - కంచికచర్ల : నందిగామకు చెందిన చైతన్య విద్యాసంస్థల యాజమాన్యం ఆధ్వర్యంలో స్థానిక జుజ్జూరు రోడ్డులో నిర్మించనున్న ఏకత్వ సీబీఎస్‌ఈ స్కూల్ భవనానికి శుక్రవారం శంకుస్థాపన జరిగింది. చైతన్య విద్యా సంస్థల అధినేత అమరనేని రమేష్ బాబు, జ్యోతి స్కూల్ భవనానికి భూమి పూజ చేశారు. విజయవాడ ఎంపీ కేశినేని నాని, నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహన్ రావు, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ యస్ ఢిల్లీ రావు, మాజీ హోం మంత్రి వసంత నాగేశ్వరరావు, నందిగామ, జగ్గయ్యపేట మాజీ ఎమ్మెల్యేలు తంగిరాల సౌమ్య, శ్రీరాం తాతయ్య ఈ కార్యక్రమంలో అతిధులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చైతన్య విద్యా సంస్థల యాజమాన్యం కంచికచర్ల లాంటి గ్రామీణ ప్రాంతంలో సిబీఎస్‌ఈ సిలబస్‌తో పాఠశాలను ఏర్పాటు చేయటం

అభినందనీయమన్నారు. ధనార్జనే ధ్యేయం కాకుండా గ్రామీణ ప్రాంత పేద పిల్లలకు తక్కువ ఫీజులతో కార్పొరేట్ స్థాయి విద్యను అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల డైరెక్టర్ అమరనేని కార్తీక్, ఎంపిపిలు కోటేరు శ్రీలక్ష్మి ముత్తారెడ్డి, బషీర్, గ్రామ సర్పంచ్‌లు వేల్పుల సునీత, బొమ్మిశెట్టి భాస్కరరావు, ఉపసర్పంచ్ వేమా సురేష్ బాబు, జడ్పీటీసీ వేల్పుల ప్రశాంతి, నాలుగు మండలాల నాయకులు పాల్గొన్నారు.

ఎలక్షన్ గోడౌన్ ప్రారంభం

ప్రజాశక్తి-విజయవాడ : డిస్ట్రిక్ట్ ఎలక్షన్ గొడౌన్‌లో భద్రపరచే ఈవీఎం, వివిప్యాట్స్ యంత్రాలకు కట్టుదిట్టమైన భద్రత కల్పించి నిరంతర నిఘా ఉంచాలని జిల్లా కలెక్టర్ ఎస్ ఢిల్లీ రావు అధికారులను ఆదేశించారు.గొల్లపూడి మార్కెట్ యార్డులో ఎన్టీఆర్ జిల్లాకు సంబంధించి ఈవీఎం, వివిప్యాట్స్‌లను భద్రపరిచేందుకు నూతనంగా ఏర్పాటు చేసిన డిస్ట్రిక్ట్ ఎలక్షన్ గొడౌన్ ను శుక్రవారం జిల్లా కలెక్టర్ ఎస్ ఢిల్లీ రావు, జాయింట్ కలెక్టర్ డా.పి.సంపత్ కుమార్, మున్సిపల్ కమీషనర్ స్వప్నిల్ దినకర్ పుడ్కర్, సబ్ కలెక్టర్ అదితి సింగ్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కర్ణాటక రాష్ట్రం బెంగళూరు నుండి జిల్లాకు 15వేలు వివిప్యాట్స్, కంట్రోల్ యూనిట్లు (సియు.యంత్రాలు) నేడు జిల్లాకు చేరుకోనున్నాయన్నారు. 6 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న ఈ గొడౌన్‌ను సిసి కెమెరాల పర్యవేక్షణలో కట్టుదిట్టమైన భద్రత కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డిఆర్‌ఓ కె. మోహన్ కుమార్, మార్కెట్ యార్డు డైరెక్టర్ ఎం. దివాకర్ బాబు, కలెక్టరేట్ పరిపాలన అధికారి ఇంతియాజ్ పాషా, రూరల్ తహశీల్దార్ జహ్నవి, ఎలక్షన్ సెల్ సూపరిండెంట్ సిహెచ్. దుర్గాప్రసాద్, డిప్యూటి తహశీల్దార్ మధు, మార్కెట్ యార్డ్ ఇఇ వై. శ్రీనివాసరావు, అసిస్టెంట్ ఇఇ వి ఎస్ ఆర్ కే ప్రసాద్ పాల్గొన్నారు.

కృష్ణా వర్సిటీ రిజిస్ట్రార్‌గా బ్రహ్మచారి నియామకం

ప్రజాశక్తి - మచిలీపట్నం రూరల్ : కష్ణా యూనివర్సిటీ నూతన రిజిస్ట్రార్‌గా బయోటెక్నాలజీ, బయో సైన్సెస్‌లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్ పి.వి. బ్రహ్మచారి నియమితులయ్యారు. ఇప్పటి వరకు రిజిస్ట్రార్‌గా డిప్యూటేషన్‌పై విధులు నిర్వహించిన ప్రొఫెసర్ రామిరెడ్డి తన మాత సంస్థ నాగార్జున యూనివర్సిటీకి తిరిగి వెళ్లారు. నూతన రిజిస్ట్రార్‌గా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ పి.వి. బ్రహ్మచారిని ఈ సందర్భంగా యూనివర్సిటీ వైస్ ఛాన్సెలర్ ప్రొఫెసర్ జి.జ్ఞాన మణి, పలువురు అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పుష్ప గుచ్ఛాలతో అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ బ్రహ్మచారి మాట్లాడుతూ ఉద్యోగులతో సోదరభావంతో మెలిగి అందరి సహకారంతో యూనివర్సిటీని మరింత ముందుకు తీసుకెళ్తానన్నారు. ఈ సందర్భంగా పలువురు యూనివర్సిటీ అధ్యాపకులు మాట్లాడుతూ రిజిస్ట్రార్‌గా బ్రహ్మచారి

నియామకం యూనివర్సిటీ అభివద్ధికి దోహద పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో ఎమ్‌బిఏ విభాగాధిపతి డాక్టర్ సీ.హెచ్. జయ శంకర ప్రసాద్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఆర్.కిరణ్ కుమార్, రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ డి.రామ శేఖర రెడ్డి, పద్మజ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.విజయ కుమారి, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ పి.రాంబాబు, ఇతర అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్‌సి రైల్వే జిఎంతో ఎంఎల్‌ఎ విష్ణు భేటీ

ఆర్‌ఒబిలు, ఆర్‌యుబిలపై చర్చ

ప్రజాశక్తి - విజయవాడ : సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ జైన్‌తో విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే మల్లాది విష్ణు శుక్రవారం సికింద్రాబాద్‌లోని ఆయన కార్యాలయంలో భేటీ అయ్యారు. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ పరిధిలో రైల్వే అభివద్ధి పనులపై ఈసందర్భంగా సుదీర్ఘంగా చర్చించారు. విజయవాడ నగరంలో నెలకొన్న రైల్వే సమస్యలపై ఇప్పటికే రాజ్యసభ సభ్యులు అయోధ్యరామిరెడ్డి కేంద్ర రైల్వే మంత్రి దష్టికి తీసుకెళ్లినట్లు ఈ సందర్భంగా గుర్తు చేశారు. పార్లమెంట్ సమావేశాలు జరగనున్న నేపథ్యంలో సెంట్రల్ నియోజకవర్గ పరిధిలోని రైల్వే సమస్యలపై ప్రత్యేక దష్టి సారించాలని కోరారు. విజయవాడ నగరంలోని జనాభా, పెరుగుతున్న ట్రాఫిక్ దష్ట్యా పలు చోట్ల రైల్వే ఓవర్ బ్రిడ్జిలు, రైల్వే అండర్ బ్రిడ్జిల నిర్మాణం చేపట్టాల్సి ఉందని జీఎం దష్టికి ఎమ్మెల్యే తీసుకువెళ్లారు. ప్రతి రోజు 70 నుంచి 180 సార్లు గేటు పడుతుండటంతో ఆయా ప్రాంతాల విద్యార్థులు, ఉద్యోగులు, రోజు వారి కూలీలు, పేషెంట్లు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని ఎమ్మెల్యే వివరించారు. ఇటువంటి పరిస్థితుల్లో ప్రజల అవసరాల దష్ట్యా గుణదలలో కె.ఎం 434/20-22 వద్ద ఒకటి, గుణదల కె.ఎం 5/6-7 వద్ద మరొకటి, మధురానగర్ పప్పుల మిల్లు వద్ద, రాజరాజేశ్వరిపేటలలోని రైల్వే గేట్ల వద్ద గతి శక్తి ప్రాజెక్టు కింద రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్.ఓ.బి.) నిర్మాణాలను చేపట్టాలని ఎమ్మెల్యే కోరారు. వాంబేకాలనీలో రైల్వే ట్రాక్ వద్ద గేటు లేకపోయినప్పటికీ ఆ ప్రాంత ప్రజల అవసరాలను గుర్తించి.. ప్రత్యేక చొరవతో ఆర్‌ఓబి నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలని కోరారు. అలాగే అజిత్ సింగ్ నగర్ - రామకృష్ణాపురం ఆర్.యు.బి వద్ద ట్రాఫిక్ రద్దీ దష్ట్యా అదనంగా మరో బాక్స్ మార్గానికి అనుమతులు ఇవ్వాలని కోరారు. అలాగే శ్రీనగర్ కాలనీ రైల్వే గేట్లు మూసివేయటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు జీఎం దష్టికి తీసుకువెళ్లారు. వీఎంసీ అధికారుల సమన్వయంతో సమస్యకు పరిష్కారం చూపాలని రైల్వే అధికారులను కోరారు. రామకష్ణాపురం - దేవీనగర్ రైల్వే అండర్ పాస్ వద్ద జరగాల్సిన రహదారి నిర్మాణం, యూజీడీ, వాటర్ లైన్ పనులకు రైల్వే పర్మిషన్లు లేకపోవడంతో ఆ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు జీఎం దష్టికి తీసుకువెళ్లారు. అందువల్ల తక్షణమే రైల్వే అనుమతులు మంజూరు చేయాలని కోరారు. బసవతారక నగర్, రామకష్ణాపురం రైల్వే ట్రాక్ వెంబడి డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడానికి రైల్వే శాఖ అనుమతులు మంజూరు చేయాలని కోరారు. ఆయా అంశాలపై జీఎం సానుకూలంగా స్పందించినట్లు మల్లాది విష్ణు తెలిపారు. ఈ సమీక్షలో ఈఈ (ఇంజనీరింగ్) శ్రీనివాస్, రైల్వే అధికారులు పాల్గొన్నారు.

'డయల్ యువర్ పోలీస్ కమిషనర్'కు 12 ఫిర్యాదులు

ప్రజాశక్తి-విజయవాడ : చట్ట పరిధిలో సమస్యల పరిష్కారానికి ఆయా స్టేషన్ల ఎస్‌హెచ్‌ఒలు చర్యలు తీసుకోవాలని నగర పోలీసు కమిషనర్ కాంతి రాణా టాటా ఆదేశించారు.

డయల్ యువర్ పోలీస్ కమీషనర్ కార్యక్రమం ఎన్.టి.ఆర్. జిల్లా పోలీస్ కమీషనర్ కాంతి రాణా టాటా శుక్రవారం నిర్వహించారు. పోలీస్ కమిషనర్ కార్యాలయంలో కేటాయించిన 0866-2490613 అనే నెంబర్ కు ప్రజలు తమ సమస్యలను నేరుగా పోలీస్ కమీషనర్‌కు తెలిపారు. ఎక్కువుగా ట్రాఫిక్ సమస్యల గురించి, అసాంఘిక శక్తుల గురించి, కుటుంబ కలహాలుగురించి, ఆర్థికనేరాలు గురించి, స్థలం తగాదాల గురించి తదితర 12 కాల్స్ చేశారు. పోలీస్ కమీషనర్ సంబంధిత పోలీస్ స్టేషన్ యస్.హెచ్.ఓ.లతో, ట్రాఫిక్ అధికారులతో మాట్లాడి ఆయా సమస్యలను చట్టపరిధిలో పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని ఎస్‌హెచ్‌ఒలను సి.పి ఆదేశించారు. డయల్ యువర్ పోలీస్ కమిషనర్ కార్యక్రమం ద్వారా నేరుగా ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను సత్వరం పరిష్కరించేందుకు, పోలీసుల పట్ల విశ్వాసాన్ని కల్పించేందుకు ఈకార్యక్రమం దోహద పడుతుందన్నారు.

నేడు, రేపు విద్యుత్ బిల్లులు చెల్లించొచ్చు

ప్రజాశక్తి-విజయవాడ : సెలవు రోజులైన రెండో శనివారం, ఆదివారం కూడా విద్యుత్ రెవెన్యూ కార్యాలయాల్లో విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రాలు యధావిధిగా పని చేస్తాయని ఎపిసిపిడిసిఎల్ విజయవాడ ఆపరేషన్ సర్కిల్ ఎస్‌ఇ ఎ మురళీమోహన్ తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ...విద్యుత్ వినియోగదారులు ఈ సదకాశాన్ని వినియోగించుకొని బిల్లులను సకాలంలో చెల్లించాలని కోరారు. నేరుగా ఇంటి వద్ద నుంచే బిల్లులు చెల్లించే సదుపాయాన్ని విద్యుత్ సంస్థ కల్పించిందన్నారు. ఎపిసిపిడిసిఎల్ కస్టమర్ యాప్ ద్వారా ఇంటి వద్ద నుంచే విద్యుత్ సర్వీసు నెంబర్‌ను యాప్‌లో రిజిస్టర్ చేసుకొని తద్వారా విద్యుత్ బిల్లులను చెల్లించవచ్చునని అన్నారు. పెటిఎం, గూగుల్ పే, ఫోన్‌పే, బీమ్, బిల్ డెస్క్ యాప్‌ల ద్వారా కూడా విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చునని అన్నారు.

COURT NOTICE

IN THE HON'BLE COURT OF THE PRL. SENIOR CIVIL JUDGE: VIJAYAWADA
E.A.NO. 97/2023
IN
E.P. NO.9/2023
IN
O.S.NO. 89/2018

Between :
Kishore Kumar Achhpeliya ....Petitioner/DHR
AND
Vanapala Sobha Rani ...Respondent/JDR

To,
Respondent : Vanapala Shobha Rani, W/o Mohanoor Raju, Hindu, age 44 years, D. No. 42-3-3b, 2 nd lane, Rama krishnapuram, Vijayawada-3
The above named DHR file the above petition against you to grant necessary orders of providing police aid to the court Amin at the time of the execution of delivery warrant of EP schedule property and the said petition was posted to 22 - 09-2023 for your appearance. You have to attend at 10.30 AM on that day before the above said Hon'ble Court in person or through advocate, failing which the above petition will be decided setting you exparte.

(By Order of the Court)
Ch. Ajay Kumar, B.Com., B.L,
Advocate, Jadagamvari Street, Suryaraopet,
Vijayawada-2,
Ph: 2432345; 9848128444.

COURT NOTICE

IN THE HON'BLE COURT OF THE PRL. SENIOR CIVIL JUDGE: VIJAYAWADA
E.A.NO. 96/2023
IN
E.P. NO.9/2023
IN
O.S.NO. 89/2018

Between :
Kishore Kumar Achhpeliya ....Petitioner/DHR
AND
Vanapala Sobha Rani ...Respondent/JDR

To,
Respondent : Vanapala Shobha Rani, W/o Mohanoor Raju, Hindu, age 44 years, D. No. 42-3-3b, 2 nd lane, Rama krishnapuram, Vijayawada-3
The above named DHR file the above petition against you to grant permissionto the court Amin to break open the locks put to the EP schedule premises if necessary for execution of warrant and the said petition was posted to 22 -09-2023 for your appearance. You have to attend at 10.30 AM on that day before the abovesaid Hon'ble Court in person or through advocate, failing which the above petitionwill be decided setting you exparte.

(By Order of the Court)
Ch. Ajay Kumar, B.Com., B.L,
Advocate, Jadagamvari Street, Suryaraopet,
Vijayawada-2,
Ph: 2432345; 9848128444.

ఒటిఎస్ పత్రాలు పంపిణీ

ప్రజాశక్తి-గూడూరు : గూడూరు మండలం గూడూరు గ్రామ సొసైటీ కల్యాణ మండపంలో శుక్రవారం గూడూరు గ్రామమునకు సంబంధించి జగనన్న సంపూర్ణ గహ హక్కు పథకం కు సంబంధించి లబ్ధిదారులకు ఓటిఎస్ పత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గూడూరు మండల పరిషత్ అధ్యక్షులు సంగా మధుసూధనరావు, స్టేట్ ఫైనాన్స్ డైరెక్టర్ కారుమంచి కామేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షులు పర్ణం పెదబాబు, సర్పంచ్ లింగం. విజయకుమార్, కె డి సి సి బ్యాంక్ డైరెక్టర్ తలుపుల. వెంకట కష్ణ, వైస్సార్సీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ మెంబెర్ మోటేపల్లి. రత్నరావు , ఎం పి డి ఒ సుబ్బారావు, తహశీల్దారు విజయ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని అన్ని గ్రామాల్లో 9వతేది శనివారం ఉదయం 8 గంటల నుండి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఎఎఇ సుబ్బారెడ్డి తెలిపారు. మెయింటినెన్స్ నిమిత్తం విద్యుత్ సరఫరా నిలుపుదల చేయటం జరుగుతుందని కావున వినియోగదారులు అందరూ సహకరించాలని ఆయన కోరారు. **ప్రజాశక్తి-బంటుమిల్లి :** బంటుమిల్లి మండలంలోని బంటుమిల్లి సబ్ స్టేషన్, అత్తమూరు సబ్టేషన్ ల పరిధిలో ఉన్న అన్ని గ్రామాలకు ఉదయం 8:30 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎఇ ఎం.రవికుమార్ తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు గమనించి సహకరించాలన్నారు.

సమస్యలపై ఎంఎల్ఎను నిలదీసిన మహిళలు

ప్రజాశక్తి-చల్లపల్లి : గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో అవనిగడ్డ శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబుపై మహిళలు మండిపడ్డారు. శుక్రవారం చల్లపల్లిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు పలు సమస్యలను ఎంఎల్‌కు విన్నవించి సమస్యలపై నిలదీశారు. ఎన్నికల తర్వాత ఇప్పుడు వచ్చారా అని ప్రశ్నించారు. దళితవాడలో అంతర్గత రోడ్లు అద్వానంగా తయారయ్యి నడవడానికి తీవ్ర ఇబ్బదులుపడుతున్నా పంచాయతీ పాలకుల స్పందించడం లేదని మండిపడ్డారు. చిన్నపాటి వర్షానికి బురదకయ్యగా మారుతున్న రహదారిని బాగు చేయించాలని విజ్ఞప్తి చేశారు. తాగటానికి ఇబ్బందిగా ఉందని నీటి పంపు వేయించాలని మరో మహిళ కోరారు. శాసనసభలు సావధానంగా వింటూ సమస్యలను పరిష్కారం చేస్తాను హామీ ఇస్తూ కొనసాగారు. చల్లపల్లి తాసిల్దార్ కే గోపాలకష్ణ, సర్పంచ్ డొక్కు నాగేశ్వరరావు, పిఎసిఎస్ చైర్ పర్సన్స్ అరజా శివశంకర్, నాని, ఫణి, ఇతర అధికారులు, సిబ్బంది వాలంటీర్లు పాల్గొన్నారు.

తుదిదశకు ఓటర్ల ఫొటో జాబితా : కలెక్టర్

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : ఫోటో ఓటర్ల జాబితాల సంక్షిప్త సవరణ కార్యక్రమంలో భాగంగా డోర్ టు డోర్ వెరిఫికేషన్ ప్రక్రియలో సమస్యలు అధికారుల దృష్టికి తేవాలని, తద్వారా నాణ్యమైన ఫోటో ఓటర్ల జాబితా తయారీకి సహకరించాలని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం నిర్వహించి ఫోటో ఓటర్ల జాబితాల డోర్ టు డోర్ వెరిఫికేషన్ కార్యక్రమంపై సమీక్షించారు. వేరే పోలింగ్ కేంద్రాల పరిధిలో ఓటు కలిగి ఉన్న వారి ఓట్లు అలాగే ఉంచకుండా, వారి నివాస ప్రాంతానికి షిఫ్టింగ్ చేయాలని, ఫోటో ఓటర్ల జాబితాలలో డబల్ ఎంట్రీలు నివారించాలని, 80 సంవత్సరాలు దాటిన వయోవద్ధులు, దివ్యాంగులు ఇంటి నుండి ఓటు హక్కు వినియోగించు కునే సౌకర్యం కల్పించాలని రాజకీయ పార్టీల ప్రతినిధులు సమావేశంలో కలెక్టర్ దష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫోటో ఓటర్ల జాబితాల వెరిఫికేషన్ లో ఇల్లు ఉంది కానీ అక్కడ ఓటు లేదు, ఓటు ఉంది కానీ ఇల్లు లేదు, ఇలాంటి వాటిని వేరువేరుగా జాబితాలు

మాట్లాడుతున్న కలెక్టర్ పి.రాజాబాబు

సిద్ధం చేయాలని బిఎల్ఓ లను ఆదేశించామని అన్నారు. షిఫ్టింగ్ అవసరమైన వాటిని గుర్తించి సంబంధిత ఫారంలో వివరాలు సేకరించి, షిఫ్ట్ చేయడం జరుగుతుందన్నారు. మరణించిన ఓటర్ల పేర్లు తొలగింపునకు, షిఫ్టింగ్ పేర్ల విషయంలో కచ్చితంగా నిబంధనలు పాటించాలని ఆదేశించామన్నారు. షెడ్యూల్ ప్రకారం అక్టోబర్ 17 నాటికి ఫోటో ఓటర్ల జాబితాల సంక్షిప్త సవరణ డ్రాఫ్ట్ జాబితాలు ప్రచురించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో డిఆర్ఓ ఎం వెంకటేశ్వర్లు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

గుడివాడలో...

గుడ్లవల్లేరులో...

సామూహిక శ్రీలక్ష్మీదేవి పూజ

ప్రజాశక్తి - గుడివాడ : పట్టణంలోని పలు దేవాలయాల్లో నాలుగవ శ్రావణ శుక్రవారం పూజా కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. శుక్రవారం కాకర్ల వీధిలోని శ్రీ వేణుగోపాలస్వామి వారి దేవస్థాన, కాలక్షేప మండపంలో నిర్వహించిన సామూహిక శ్రీ లక్ష్మీదేవి పూజా కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. లోక కళ్యాణార్థం దేవస్థానం ఆధ్వర్యంలో లక్ష్మీదేవి పూజా కార్యక్రమాలు నిర్వహించి ఉచిత పూజ సామాగ్రి అందించినట్లు దేవస్థానం ధర్మకర్తల కమిటీ చైర్మన్ దుడ్డు చిన్నా , ఈవో యార్లగడ్డ వాసులు తెలియజేశారు. పూజా కార్యక్రమాలను దేవస్థాన ధర్మకర్తల కమిటీ సభ్యులు పర్యవేక్షించారు. **ప్రజాశక్తి-గుడ్లవల్లేరు :** గుడ్లవల్లేరు మండం డోకిపర్రు మహాక్షేత్రంలో వేంచేసి ఉన్న శ్రీ భూసమేత శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రత పూజను కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త సుధారెడ్డి , కుటుంబ సభ్యులు విజయలక్ష్మి, ప్రసన్న, విజయభాస్కరమ్మ, వెంకటలక్ష్మి, హరిణి, పెద్ద సంఖ్యలో మహిళా భక్తులు పాలు పంచుకున్నారు. భక్తులకు వ్రత పూజా సామాగ్రిని ఆలయ వ్యవస్థాపకులు అందచేశారు. వరలక్ష్మీ వ్రత పూజను పురస్కరించుకుని డోకిపర్రు మహాక్షేత్రాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలు, పూలతో అలంక రించారు. వరలక్ష్మి వ్రత ప్రాశస్త్యాన్ని వేద పండితు సోదాహరణంగా వివరించారు. వరలక్ష్మి వ్రతాన్ని పురస్కరించుకుని ఆయంలో శుక్రవారం ఉదయం లక్ష్మీ యాగం, మహాశాంతి హెూమం నిర్వహించారు. పూజ అనంతరం భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. ఆలయాన్ని సందర్శించే భక్తులకు పంపిణీ చేసే ప్రసాదం తయారీకి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పోటు, పూజా సామాగ్రి విక్రయ కేంద్రాన్ని సుధా రెడ్డి ప్రారంభించారు. **ప్రజాశక్తి-హనుమాన్‌జంక్షన్ :** హనుమాన్ జంక్షన్ లోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శ్రావణమాస శుక్రవారం సందర్భంగా సామూహిక వరలక్ష్మీ పత్రాన్ని నిర్వహించారు. అర్చకులు సీతారామాచార్యుల పర్యవేక్షణలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. తదనంతరం అర్చకుల ఆధ్వర్యంలో వ్రత కార్యక్రమంలో పాల్గొన్న మహిళలకు వేర్వేరుగా కలశాలు నెలకొల్పి శాస్త్రోక్తంగా సామూహిక శ్రావణ వరలక్ష్మీ వత్రాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. **ప్రజాశక్తి-గుడ్లవల్లేరు :** మండలంలోని వడ్లమన్నాడు గ్రామంలో 150 సంవత్సరాల చరిత్ర గల మహాలక్ష్మి అమ్మవారి మాను వద్ద శ్రావణమాసం ఆఖరి శుక్రవారం సందర్భంగా మహిళలు వ్రతాలను నిర్వహించారు. అనంతరం ఐదు వేల మందికి అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు .ఈ కార్యక్రమ గంధం వీరరాఘవయ్య, పురమా నాగు, పుల్లేటి గంగయ్య, గంధం శివ, కటకం కొండ ,గుడిసేవ రాజబాబు పాల్గొని అత్యంత వైభవంగా నిర్వహించారు.



నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు : సర్పంచ్

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మెగా ఇంజనీరింగ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ నిర్వాహకులు సుధా రెడ్డి ఆధ్వర్యంలో నిరుద్యోగులకు స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్‌తో పాటు ఉద్యోగ అవకాశాలు కూడా కల్పిస్తున్నట్లు గ్రామ సర్పంచ్ గోసాల జ్యోతి లవకుమార్ తెలిపారు. డోకిపర్రు గ్రామంలో శుక్రవారం శిక్షణ కార్యక్రమాన్ని సుధారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ జ్యోతి మాట్లాడుతూ స్త్రీలకు కుట్టు శిక్షణ, అల్లికలు, డైరీ ఫార్మ్ పురుషులకు డ్రైవింగ్, ఎలక్ట్రిషన్, ప్లంబర్, మెకానిక్ లో ట్రైనింగ్ ఇచ్చి మేఘా లో జాబ్ కూడా ఇస్తామన్నారు. ఆసక్తి గలవారు తప్పక రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. ఏ ప్రాంత వారైనా సరే సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.

ఎస్‌విఎల్‌లో ఫ్రెషర్స్ డే వేడుకలు

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డలోని ఎస్‌విఎల్ క్రాంతి కళాశాలల ఆధ్వర్యంలో ఉత్సాహ భరితంగా ఫ్రెషర్స్ డే కార్యక్రమాన్ని శుక్రవారం ఏఎస్ఆర్ కళ్యాణ మండపంలో నిర్వహిం

చారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ దుట్టా ఉమామహేశ్వర రావు ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులకు శుభాకాంక్షలు తెలుపుతూ స్వాగతం ఉపన్యాసం చేశారు. నూతన ఆశలతో ఆకాంక్షలతో కళాశాలలోకి అడుగుపెట్టిన విద్యార్థులు పట్టుదల క్రమశిక్షణ కషితో విద్యను అభ్యసించాలని తద్వారా ఉన్నత శిఖరాలను అధిరోహించగలుగుతారని సూచించారు. తల్లిదండ్రులు తమపై ఎన్నో ఆశలతో ఆకాంక్షలతో కష్టపడి కళాశాలకు పంపుతున్నారని వారి ఆశలను ఉమ్మ్ము చేయకుండా విద్యను అభ్యసించాలన్నారు. తోటి వారి పట్ల సోదర భావాన్ని ప్రదర్శిస్తూ ఐక్యమత్యంతో మెలగాలన్నారు విద్యార్థి దశ నుండి జీవితాన్ని మలుచుకోవాలని, దుర్వ్యసనాలకు బానిసలు కాకుండా ఉన్నతమైన ఆశయాలతో బాధ్యతగా గల విద్యార్థులుగా పౌరులుగా సమాజానికి ఆదర్శంగా తమని తాము తీర్చిదిద్దుకోవాలని సూచించారు. చదువు ద్వారానే తమ ఎదుగుదల ఉందని విషయాన్ని గుర్తించాలన్నారు. ఉన్నత చదువులు అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించడంతోపాటు కుటుంబాలకు అండదండగా పుట్టిన గ్రామానికి చదివిన కళాశాలకు తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతలు తీసుకొచ్చే విధంగా జీవించాలని కరస్పాండెంట్ సూచించారు. జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్వి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకోవడంతోపాటు విద్యార్థులను ఉత్తేజ పరచాయి. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, అధ్యాపకులు, సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

వర్గీకరణపై కలెక్టర్‌కు వినతి

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : ఈ నెల 18 వ తేదీన జరగభోవు అత్యవసర పార్లమెంటు సమావేశాలలో షెడ్యూల్ కులాల రిజర్వేషన్ల వర్గీకరణకు చట్ట బద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ మహాజన సోషలిస్ట్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం కృష్ణా జిల్లా కలక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్ పి.రాజా బాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ ధర్నా లో మహాజన్ సోషలిస్ట్ పార్టీ జిల్లా కన్వీనర్ కొల్లూరి బసవ, జిల్లా ఇంచార్జ్ కోట దానియల్, మహాజన్ సోషలిస్ట్ పార్టీ నాయకులు సిదిలా జయరాజ్, జిల్లా కో కన్వీనర్ పామర్రు నియోజకవర్గం కన్వీనర్ కో కన్వీనర్ రాయవరపు మౌలి, అవనిగడ్డ నియోజకవర్గం కన్వీనర్ కొక్కిలిగడ్డ నవీన్ , మచిలీపట్నం నియోజకవర్గం కన్వీనర్ శీలం శర్మ పాల్గొన్నారు.

అదనపు పనిభారంతో పారిశుధ్య కార్మికుల ఇబ్బందులు

ప్రజాశక్తి-చల్లపల్లి : అదనపు పనిభారాలతో అనారోగ్యాలకు గురవుతున్న చల్లపల్లి పంచాయతీ పారిశుధ్య కార్మికులకు పని భారం తగ్గించాలని కోరుతున్నారు. రాజకీయాలకు అతీతంగా పారిశుధ్య కార్మికుల సమస్యల పరిష్కారానికి పంచాయతీ పాలకవర్గం,అధికారులు ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. చల్లపల్లి పంచాయతీలో అధికారుల తప్పిదాలు పారిశుధ్య కార్మికుల పాలిట శాపాలుగా మారాయని విమర్శలు వినిపిస్తున్నాయి. 19 వార్డులతో మేజర్ పంచాయతీగా ఉన్న చల్లపల్లికి చెత్తను సేకరించడానికి గతంలో నాలుగు ట్రాక్టర్లు ఉండేవి. నాలుగు ట్రాక్టర్లు ఉన్నప్పటికీ చెత్తను సేకరించటం కష్ట సాధ్యంగా మారి రోజు మార్చి రోజు చెత్తను సేకరించే పరిస్థితి ఉండేది . చల్లపల్లి ఎస్సీ వాడకు చెందిన వ్యక్తికి చెందిన ఒక ట్రాక్టర్ కు ఎస్సీ కార్పొరేషన్

లోన్ పెండింగ్ లో ఉందన్న కారణంతో ఆ ట్రాక్టర్ కాంట్రాక్టును రద్దు చేయడం వల్ల ప్రస్తుతం మూడు మాత్రమే చెత్తను సేకరించడానికి వినియోగిస్తున్నారు. ఎస్సీ కార్పొరేషన్ కింద సదరు ట్రాక్టర్ నుండి ప్రతినెలా పంచాయతీ అధికారులు ప్రభుత్వ సబ్సిడీ ఫోను మిగతా చెల్లించాల్సిన రుణాన్ని మొత్తాన్ని ప్రతినెలా పంచాయితీ అధికారులు మినహాయించాల్సి ఉన్నప్పటికీ గతంలో ఉన్న అధికారులు ఆ పని చేయకపోవడం వల్ల లోను మొత్తం లక్ష రూపాయలు పైగా పెండింగ్‌లో ఉంది. లోన్ పెండింగ్ లో ఉందన్న కారణంతో సదరు ట్రాక్టర్ కాంట్రాక్టర్ను పంచాయతీ అధికారులు నిలిపి వేశారు. దానివల్ల పారిశుద్ధ్య కార్మికులపై అదనపు పని భారం పడటం వల్ల వాళ్లు తీవ్ర ఇబ్బందులకు గురవుతూ అనారోగ్య పాలవుతున్నారు. ఆరోగ్య సమస్యలతో ఒకరోజు పనికి రాకపోయినా మిమ్మల్ని విధుల నుంచి తొలగిస్తామంటూ కాంట్రాక్టర్ బెదిరింపులు వాళ్లను మరింతగా తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్నాయి అని కార్మికుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమాజంలో పారిశుధ్య కార్మికులు నిర్వర్తించే విధులు, పరిస్థితులు,కష్టాలు వర్ణింప లేనివి. వర్షాకాలంలో వారి పరిస్థితులు ,కష్టాలు మరింత వర్ణనాతీతం. అటు పంచాయతీ సిబ్బందిని, కాంట్రాక్టర్ను ఎవరినీ అడగలేని, ప్రశ్నించలేని దుర్బలమైన జీవితాలు గడుపుతున్నారు.

కాలి గాయంతో బాధపడుతున్న వ్యక్తికి అరుదైన శస్త్ర చికిత్స

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్శిటీ : కుడి కాలు తొడ తీవ్ర గాయంతో బాధపడుతున్న 48 ఏళ్ల వ్యక్తికి విజయవంతంగా శస్త్ర చికిత్స నిర్వహించినట్లు అమెరికన్ ఆంకాలజీ ఇనిస్టిట్యూట్ సర్జికల్ ఆంకాలజిస్టులు డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, డాక్టర్ ప్రతాప్ దుగ్గిరాల తెలిపారు. నగరంలోని అమెరికన్ ఇనిస్టిట్యూట్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వివరాలను తెలియచేశారు. రోగి గతంలో కుడి తొడకు కాలిన గాయం ఉందని దీని ఫలితంగా మచ్చ కూడా ఏర్పడిందని తెలిపారు. ఈగాయం ఒక చిన్న పుండుగా ప్రారంభమై భయంకరమైనదిగా వ్యాప్తించిందని అన్నారు. ఇతర ఆసుపత్రులలో మోకాళ్లపై వరకు కాలు తొలగించడం మంచిదని సలహా ఇచ్చారని, కాని అమెరికన్ ఆంకాలజీ ఇనిస్టిటట్యూట్‌లో పరిశీలించి అత్యాధునిక చికిత్స అందించామని కాలు తొలగించకుండా చికిత్స అందించినట్లు తెలిపారు. తమ వద్దకు వచ్చిన రోగిని పరిశీలించిన తరువాత పెట్ సిటీ స్కాన్ చేసి గాయాన్ని పరిశీలించి చికిత్స నిర్వహించినట్లు తెలిపారు. ప్లాస్టిక్ సర్జన్ వైద్యుల నిపుణుల పర్యవేక్షణలో చికిత్స అందించామని ప్రస్తుతం రోగి పూర్తిగా కోలుకున్నట్లు తెలిపారు. అమెరికన్ ఆంకాలజీ ఇనిస్టిట్యూట్‌లో అనుభవజ్ఞులైన వైద్య బృందం ఉండటం వల్లనే అత్యాధునిక చికిత్స సాధ్యమవుతుందని తెలిపారు.

గైడ్ ప్రొఫెసర్ చేతల మీదుగా పిహెచ్‌డి డిగ్రీ అందుకున్న అబీదా

ఆబీదాకు పిహెచ్‌డి ప్రదానం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : భవానీపురంలో నివాసితులు డాక్టర్ జాకీర్ హుస్సేన్ కళాశాల వ్యవస్థాపక సభ్యులు, మాజీ వక్ఫ్ బోర్డు చైర్మన్ సయ్యద్ అహ్మద్ అలీ కోడలు ఆబీదా బేగం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నుండి శుక్రవారం పిహెచ్‌డి పొందారు. తన పరిశోధన గ్రంథం 'ఏ స్టడీ ఆన్ ఎంబిజె న్యూట్రో స్కోపిక్ ఐడియల్స్ అండ్ ఫిల్టర్స్ ఇన్ లాటిక్ ఇంప్లికేషన్ ఆల్జీబ్రాస్' గణిత ప్రొఫెసర్ డాక్టర్ అమరేంద్రబాబు ఆధ్వర్యంలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయానికి సమర్పించినందుకు గానూ గణిత శాస్త్రంలో పిహెచ్‌డి డిగ్రీ ప్రదానం చేశారు. ప్రస్తుతం ఆబిదా బేగం కష్ణ విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాలలో గణిత అధ్యాపకురాలుగా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా ఆబీదా బేగంను పుర ప్రముఖులు, స్థానికులు, విద్యార్థినీ విద్యార్థులు ఘనంగా సన్మానించారు.

క్రాంతిలో కృష్ణాష్టమి వేడుకలు

ప్రజాశక్తి ఇబ్రహీంపట్నం : కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలోని క్రాంతి హైస్కూల్లో కృష్ణాష్టమి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఎల్ కేజీ యూకేజీ విద్యార్థిని విద్యార్థులు కష్ణుడు గోపికల వలే వేషధారణ ధరించి ఈ వేడుకలలో పాల్గొన్నారు. ప్రైమరీ తరగతుల విద్యార్థిని విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు, కోలాటం తదితర ప్రదర్శనలు నిర్వహించారు. విద్యార్థినీ విద్యార్థులకు సంస్కృతి సాంప్రదాయాలను పరిచయం చేయడానికి మాత్రమే ఇటువంటి పండుగలు పాఠశాలలో నిర్వహిస్తున్నా మని పాఠశాల కరస్పాండెంట్ మురళీమోహన్ తెలియజేశారు.

చిన్ని గోపికల్లా చిన్నారులు...

రమేష్ హాస్పిటల్స్‌లో విజయవంతంగా

100 పోయెమ్ శస్త్ర చికిత్సలు

- ఎండోస్కోపీ ద్వారా అన్న వాహికకు అధునాతన చికిత్స

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్శిటీ : నగరంలోని ఆస్టర్ రమేష్ హాస్పటల్స్‌లో విజయవంతంగా 100 ' పోయెమ్' శస్త్ర చికిత్సలు నిర్వహించినట్లు హాస్పటల్ సీనియర్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్టు డాక్టర్ బత్తిని రాజేష్ తెలిపారు. ఎం.జి.రోడ్డులోని రమేష్ హాస్పటల్స్‌లో శుక్రవారం విలేకరుల సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోనే ప్రప్రథమంగా పోయెమ్‌శస్త్ర చికిత్సలు నిర్వహించిన ఆసుపత్రిగా రమేష్ హాస్పటల్ ఘనత సాధించిందని తెలిపారు. కొన్ని కారణాల వలన ఆహార నాళము మూసుకుపోయి ఆహారం మింగుడు పడకపోవచ్చని దీనినే అఖలేసియా కార్డియా అంటారని, దీనికి చికిత్స అందించే విధానాన్ని పోయెమ్ అంటారని తెలిపారు. 9 సంవత్సరాల నుండి 72 సంవత్సరాల వయసు కల 100 మందికి తమ హాస్పటల్ నందు విజయవంతంగా పోయెమ్ చికిత్స అందించినట్లు తెలిపారు. ఈవ్యాధి గురించి ఆయన తెలియచేస్తూ ఆహార నాళం యొక్క కండరాల ద్వారా ఆహారం పొట్ట లోనికి వెళు తుందన్నారు. ఆఖలేసియా కార్డియా అనే ఈవ్యాధిలో ఆహారం ఆహారనాళం నుండి పొట్టలోకి వెళ్లకుండా ఆహార నాళం యొక్క కండరాలు అడ్డుపడతాయని, దీని ఫలితంగా ఆహారం ఆహారనాళిక వద్దనే అడ్డుపడిపోతుందన్నారు. దీనికి చికిత్స చేయని పక్షంలో మింగడమే అసాధ్యమయ్యే పరిస్థితి కలగవచ్చని తెలిపారు. దీని వలన గొంతులో ఆహారం లేదా ఇరుక్కుపోయినట్లు అనిపించడం గుండెల్లో మంట, ఛాతీ నొప్పి, దగ్గు, ఆహారం ఊపిరితిత్తులలోకి చేరడం, బరువుతగ్గడం, వాంతులు వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. ఈ వ్యాధి ఆడవారికి, మంగవారికి, ఏ వయసువారికైనా రావచ్చని అన్నారు. లక్షమందిలో ఒకరికి ఈ

మాట్లాడుతున్న వైద్యులు

వ్యాధి వచ్చే అవకాశం ఉందని డాక్టర్ రాజేష్ తెలిపారు. అఖలేసియా కార్డియాకు వివిధ రకాల శస్త్ర చికిత్సలు అందుబాటులో ఉన్నప్పటికీ ఈమధ్య కాలంలో వచ్చిన నోటి ద్వారా ఎండోస్కోపిక్ పరికరాన్ని పంపించి అన్న వాహిక చివర ఉన్న కండరాన్ని సరిచేసే ప్రక్రియను ' ఫర్ ఓరల్ ఎండోస్కోపిక్ మయాటమి ' లేదా ' పోయెమ్ ' అంటారన్నారు. ఈచికిత్స సురక్షితమైనది, ఖచ్చితమైననది తెలిపారు ఈవిధానంలో ఆపరేషన్ ద్వారా వచ్చే ఫలితాలు కన్నా మెరుగైన ఫలితం వస్తుందని ఎటువంటి కోత కుట్లు అవసరం ఉండవని తెలిపారు. ఇటువంటి చికిత్సలకు ప్రావీణ్యత, అనుభవం నాణ్యమైన అధునాతన వైద్య పరికరాలు అందుబాటులో ఉన్నపుడే విజయవంతంగా నిర్వహించడం సాధ్యమవుతుందని తెలిపారు. ఈకార్యక్రమంలో ఆస్టర్ రమేష్ హాస్పటల్స్ క్వాలిటీ హెడ్ డాక్టర్ సౌజన్య, మత్తు వైద్య నిపుణులు డాక్టర్ చెరుకూరి పద్మజ పాల్గొన్నారు.

నేత్రదానంపై అపోహలు వీడాలి

- ప్రచార పక్షోత్సవాల ముగింపులో అనురాధ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : "నేత్రదానం గురించి అపోహలు విడనాడాలి. నేత్రదానం మహోన్నతమైనది. ఒక వ్యక్తి మరణించగా అతని నేత్రాలను దానం చేయడంతో ఇద్దరి అంధుల జీవితాలలో వెలుగు వస్తుంది. నేత్రాలు అమూల్యమైనవి. వాటిని మట్టిపాలు, బుగ్గిపాలు చేయవద్దు" అని ప్రముఖ విద్యావేత్త, నలంద డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ యం.అనురాధ అన్నారు. స్వేచ్ఛా గోరా ఐ బ్యాంక్ నిర్వహించిన నేత్రదాన ప్రచార పక్షోత్సవాల ముగింపు సభ శుక్రవారం సాయంత్రం బెంజిసర్కిల్ వద్ద గల నాస్తిక కేంద్రం వద్ద జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ విద్యార్థినులు నేత్రదానం ఉద్యమంలో భాగస్వాములు అయితే వారి ఆలోచనలతోనూ నేత్రదాన ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయగలరన్నారు. నేత్రదానం గురించి విస్తృత ప్రచారం జరగాలన్నారు. స్వేచ్ఛా గోరా ఐ బ్యాంక్ 900 రెండు కళ్ళు అంధులకు చూపుని ప్రసాదించి

మాట్లాడుతున్న ఎం.అనురాధ

అంధత్వ నివారణలో భాగస్వాములవడం ఎంతో ప్రశంసనీయమన్నారు. ఈ సందర్భంగా స్వేచ్ఛా గోరా ఐ బ్యాంక్‌కు తమ అమూల్యమైన సేవలందిస్తున్న డాక్టర్ మనోహర్, పాటల పోటీలకు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించిన గాయకులు మల్లిక్, సూర్యనారాయణ సముచిత రీతిన సన్మానం చేసారు. తొలుత స్వేచ్ఛా గోరా ఐ బ్యాంక్ మేనేజర్ సభకు స్వాగతం పలకగా డాక్టర్ మారు వందన సమర్పణ చేశారు.

దేశానికి సేవ చేయటం ఆనందంగా ఉంది

-కెబిఎన్ కళాశాల పూర్వ విద్యార్థి బి.నాగభూషణ రెడ్డి

ప్రజాశక్తి - వన్‌టౌన్ : దేశం రోదశీలోకి పంపించే శాటిలైట్లలో వినియోగించే విడిభాగాలను అందించటం తద్వారా దేశానికి సేవ చేయటం ఎంతో ఆనందాన్ని కలిగిస్తుందని నాగసాయి ప్రెసెషియన్ ఇంజనీర్స్ ప్రైవేట్ లిమిటెడ్ అధినేత, కేబీఎన్ కళాశాల పూర్వ విద్యార్థి బీ. నాగభూషణ రెడ్డి అన్నారు. ఇస్రో రోదశీలోకి పంపించే ఉపగ్రహాలలో బ్యాటరీకు రక్షణ కవచాలకు సంబంధించిన విడి భాగాలను తయారు చేసే నాగభూషణరెడ్డి విజయవాడ కేబీఎన్ కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యను అభ్యసించారు. ఈ సందర్భంగా ఆ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో ఆ కళాశాల ప్రాంగణంలో శుక్రవారం జరిగిన అభినందన కార్యక్రమంలో సంఘ నాయకులు, కళాశాల పాలకవర్గం నాగభూషణరెడ్డిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నాగభూషణరెడ్డి మాట్లాడుతూ ఇస్రో పంపించే ఉపగ్రహాలకు సంబంధించి బ్యాటరీ వ్యవస్థ చాలా కీలకమైనదన్నారు. అది పనిచేస్తున్నప్పుడే భూమి మీదకు సమాచారాన్ని అందించగలదన్నారు. అటువంటి బ్యాటరీ వ్యవస్థకు కవచాలను తమ సంస్థ ద్వారా అందిస్తున్నామన్నారు. తాను విజయవాడ గాంధీనగర్‌లోని హిందూ హైస్కూల్‌లో హైస్కూల్ విద్యను, కేబీఎన్ కళాశాలలో ఇంటర్మీడియట్‌ను అభ్యసించానని, ఆ

కెబిఎన్ పూర్వ విద్యార్థిని సత్కరిస్తున్న కళాశాల అధ్యక్ష కార్యదర్శులు తొమ్మండ్రు శేషయ్య, శ్రీనివాసులు

తరువాత ఇంజనీరింగ్ చేశానన్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నడిచే టూల్ డిజైనింగ్ ఇనిస్టిట్యూట్‌లో పీజీ చేశానని వివరించారు. ఆ తరువాత తాను పని చేసిన కొన్ని రక్షణ వ్యవస్థ సంస్థలలో పొందిన అనుభవంతో ఉపగ్రహాలకు అవసరమయ్యే కొన్ని భాగాలను తయారు చేస్తున్నట్లు చెప్పారు. కళాశాల అధ్యక్ష కార్యదర్శులు తొమ్మండ్రు శేషయ్య, తూనికుంట్ల శ్రీనివాసులు మాట్లాడుతూ తమ కళాశాల పూర్వ విద్యార్థులు వివిధ రంగాల్లో అద్భుతమైన ప్రతిభాపాటవాలను ప్రదర్శిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో హిందూ హైస్కూల్స్ కమిటీ కోశాధికారి గోళ్ల బాబావిజయకుమార్, కళాశాల కోశాధికారి అన్నం రామకష్ణారావు, ప్రిన్సిపాల్ డాక్టర్ వీ నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

వింక్ స్టూడియో సరికొత్త మ్యూజిక్ ఆల్బమ్

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : మ్యూజిక్ స్ట్రీమింగ్ యాప్ అయిన వింక్ స్టూడియో ద్వారా సరికొత్త మ్యూజిక్ ఆల్బమ్ రూపొందిస్తున్నామని వింక్ స్టూడియో అధినేత ఎం.రమేష్ తెలిపారు. నగరంలోని వింక్‌స్టూడియోలో వివరాలను తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ఇప్పటికే లవ్ ఆల్ అనే చిత్రం ద్వారా డిస్ట్రిబ్యూషన్ హక్కులను సాధించిందని, రాను న్న కాలంలో ప్రముఖుల జీవిత చరిత్ర ఆధారం గా మ్యూజిక్ ఆల్బమ్స్‌ను రూపొందించనున్నట్లు తెలిపారు. మ్యూజిక్ అంటే ఎంతో ఇష్టపడే వారు ఎంతో మంది ఉన్నారని వారి కోసం ప్రత్యేకంగా ఎప్పటికపుడు వినూత్నంగా మ్యూజిక్ ఆల్బమ్స్ అందిస్తున్నామని తెలిపారు.

గుంటుపల్లిలో రాష్ట్రీయ పోషణ్ మాసోత్సవాలు

ప్రజాశక్తి ఇబ్రహీంపట్నం : మైలవరం ప్రాజెక్టు సిడిపిఒ ఆదేశాల మేరకు రాష్ట్రీయ పోషణ్ మాసోత్సవాలను ఇబ్రహీంపట్నం సెక్టార్ గుంటుపల్లి 1 అంగన్వాడీ కేంద్రంలో సూపర్వైజర్ జి.రమాదేవి ఆధ్వర్యంలో నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో స్వస్థ బాల స్పర్ధ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గౌస్ బాషా పిల్లలకు స్క్రీనింగ్ టెస్ట్ చేశారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఓ కే మానస అంగన్వాడీ టీచర్ కే రాణి ఏఎన్ఎం బి రాణి ఆశా వర్కర్లు హెల్పర్లు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్ఆర్‌సి ఉపాధ్యక్షులుగా కృష్ణమోహన్

ప్రజాశక్తి - తిరువూరు : జాతీయ మానవ హక్కుల సంఘం (ఎన్‌హెచ్ ఆర్‌సి) దక్షిణ భారతదేశ ఉపాధ్య క్షులుగా తిరువూరుకు చెందిన లయన్స్ క్లబ్ సీనియర్ నేత గంజా కష్ణ మోహన్ నియమితులయ్యారు. ఈ మేరకు అయన తిరువూరులోని కనకం రెసిడెన్సిలో విలేకర్ల సమావేశంలో శుక్రవారం వెల్లడించారు. ఈ పదవిలో 2025 వరకు ఏప్రిల్ వరకు రెండేళ్ల పాటు పదవిలో కొనసాగుతానని, మానవ హక్కుల పరిరక్షణకు, సమాజంలో నేరాలు, ఘోరాలు, అవినీతి నిర్మూలన కోసం జాతీయస్థాయిలో ముఖ్య భూమిక పోషించనున్నట్లు తెలిపారు. సమాజంలో దిగువ, మధ్య తరగతి ప్రజలకు సాంఘిక న్యాయం చేసేందుకు ఎన్‌హెచ్‌ఆర్‌సి సౌత్‌ఇండియా వైస్ ప్రెసిడెంట్‌గా మానవ హక్కుల పరిరక్షణకు శాయశక్తులా కషి చేస్తానని కష్ణ మోహన్ తెలిపారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సత్కారం

ప్రజాశక్తి-గంపలగూడెం : గురుపూజోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కలెక్టర్ డిల్లీరావు బొల్లెపోగు కిరణ్‌కుమార్‌ను జిల్లా ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపిక చేసి సత్కరించిన విషయం తెలిసిందే. ఈ అంశాన్ని పురస్కరించుకొని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇన్చార్జిగా పనిచేస్తున్న కిరణ్‌కు పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది శుక్రవారం చిరు సత్కారాన్ని అందించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ, తమ పాఠశాల నుండి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా కిరణ్‌కుమార్ ఎంపిక కావడం తమ పాఠశాల అదష్టంగా వివరించారు. అనంతరం శాలువాతో సత్కరించారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.